శనివారం 20.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 59 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



డీఎస్సీ ప్రశ్నపత్రాల అప్‌లోడ్ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి అంశం పారదర్శకంగా నిర్వహించారు. టాటా సంస్థ ఆధ్వర్యంలో భద్రతా ప్రమాణాలతో ప్రక్రియ పూర్తి చేశారు. డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, వైసీపీ నేతలు ఆధారాలతో సమాధానం చెప్పాలి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్.... ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత

## కోల్ కతాలో మంత్రి లోకేష్ పెట్టుబడుల వేట

- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలి
- బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి
- దేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక కేంద్రంగా కోల్‌కతా
- బలమైన బెంగాల్ అంటే బలమైన భారతదేశం
- సంస్కరణల అమలులో ఏపీ ముందంజలో ఉంది
- ఒకేరోజు 17మంది పారిశ్రామికవేత్తలతో భేటీలు మిగతా 2లో...





**కోల్ కతా (జర్నలిస్ట్ ఫైల్) :** బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయని, స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ ఏపీ ప్రత్యేకతలని, ఏపీ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. కోల్ కతా లోని ఐటీసీ సోనార్ హోటల్ జరిగిన ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(×జజ) ప్లీనరీలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు' అనే అంశంపై జరిగిన ప్లీనర్ సెషన్ లో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, మేధావులు, సంపద సృష్టికర్తలు, దేశ నిర్మాణకర్తల సమక్షంలో ఉండడం గౌరవంగా ఉంది. నేను చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన ఒక మాట ఉంది. ఈ రోజు బెంగాల్ ఏం ఆలోచిస్తుందో.. రేపు భారత్ అది ఆలోచిస్తుంది. అందుకే మళ్లీ కోల్‌కతాకు వచ్చి.. మీ అందరి మధ్య ఉండడం నాకు ఎంతో గౌరవంగా, ఆనందంగా అనిపిస్తోంది. భారతదేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక ప్రయాణానికి కోల్‌కతానే రాజధానిగా నేను భావిస్తాను. బలమైన బెంగాల్ అంటే బలమైన భారతదేశం అని నేను గట్టిగా నమ్ముతున్నాను.

**రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటేనే అభివృద్ధి సాధ్యం :** గురువారం సాయంత్రం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి గారిని కలిసే అవకాశం నాకు లభించింది. అభివృద్ధి పట్ల వారి అంకితభావం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటేనే భారతదేశం గెలుస్తుందని నేను విశ్వసిస్తాను. పోటీ ఉత్తమ ఫలితాలను తీసుకొస్తుంది. అదే సమయంలో రాష్ట్రాలు కలిసి పనిచేసి.. తమ బలాలను పెంచుకోవాలి. తద్వారా మరింత శక్తివంతమైన భారతదేశాన్ని నిర్మించగలం. ఉద్యోగాల కల్పన విషయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి గారి సంకల్పం నన్ను ఆశ్చర్యపరిచింది. ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ పూలింగ్ ఎలా చేస్తున్నారని ఆయన నన్ను నేరుగా అడిగారు. మీరు అనుసరిస్తున్న విధానం ఏమిటని ప్రశ్నించారు. భూమి అనేది ప్రతి భారతీయుడికి భావోద్వేగంతో ముడిపడి ఉంటుంది. అయినప్పటికీ రైతులకు వారి భవిష్యత్తు, వారి పిల్లల భవిష్యత్తు ఉద్యోగాల కల్పనతో ముడిపడి ఉందని, మేం వారిని ఒప్పగించగలిగామని చెప్పాను. మిగతా 2లో...

## అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు



- వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణంపై దృష్టి
- స్వచ్ఛాంధ్ర పనుల్లో జాప్యం వద్దు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కాలుష్యం తగ్గించడం.. స్వచ్ఛతను పెంచడం... వ్యర్థాలను సద్వినియోగం చేసుకుని సర్క్యులర్ ఎకానమీ దిశగా అడుగులు వేయడం అనే అంశాలు నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా చేపట్టే వివిధ కార్యక్రమాలు.. పనులపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాలుష్యాన్ని తగ్గించేందుకు.. స్వచ్ఛత పాటించేందుకు పెద్ద పీట వేసిందన్నారు. ప్రతీ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని... ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచుతున్నామన్నారు. నెట్ జీరో, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై దృష్టి సారించామని... దీంట్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, స్కూళ్లు, అంగన్ వాడీ వంటి కేంద్రాల్లో ఈ అంశాలకు పెద్ద పీట వేస్తున్నామని సీఎం చెప్పారు. కాలుష్యం తగ్గించడంతోపాటు.. ఖర్చులను కూడా తగ్గించుకునేలా అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్ లు ఇస్తున్నామని... ఇప్పటికే మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో 11,400 ఇండక్షన్ స్టవ్ లను పంపిణీ చేశామని సీఎం చెప్పారు. ఈ నెలాఖరులోగా మిగిలిన 44,346 అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇండక్షన్ స్టవ్స్ వల్ల నెలకు రూ. 247 మేర ఆదా అవుతోందని సీఎం చెప్పారు. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణం విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహణలో ఉన్న విశాఖ, గుంటూరు ప్లాంట్ల పనితీరుపై సీఎం ఆరా తీశారు. కడప, కర్నూలు జిల్లాల్లో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు శనివారం శంకుస్థాపనకు ఏర్పాట్లు చేసినట్టు అధికారులు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు, కాకినాడ విజయవాడలలోని మిగతా 2లో...

## ఒకే వేదికపై అటవీ సేవలు



- పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా భూమిపూజ
- రూ.24 కోట్లతో అటవీ పరిశోధన-శిక్షణ సముదాయం
- ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయి కమాండ్ సెంటర్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ భవనం అరణ్యారామానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో, బ్రహ్మానందపురం వద్ద సూమారు రూ. 24 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలసి పవన్ కళ్యాణ్ నూతన భవన ప్రాంగణానికి భూమి పూజ చేశారు. మిగతా 2లో...

## క్వాంటం టెక్నాలజీలో.. ఏపీ సరికొత్త చరిత్ర





- అమరావతి క్వాంటం వ్యాలీలో -269°C అత్యంత శీతల వాతావరణం సృష్టి
- క్వాంటం హార్డ్‌వేర్ టెస్టింగ్‌లో దేశానికి కీలక కేంద్రంగా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త మైలురాయిని సాధించింది. అమరావతి క్వాంటం వ్యాలీలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేసిన మిగతా 2లో...

## ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా ఏపీ



- విదేశీ పర్యాటకంలో 17% వృద్ధి.. దేశంలో 13వ స్థానానికి రాష్ట్రం
- రూ.20 వేల కోట్ల పెట్టుబడులు.. 1.22 లక్షల ఉద్యోగాల లక్ష్యం
- సంస్కృతి-సినిమా-టూరిజం సమన్వయంతో కొత్త బ్రాండ్ ఇమేజ్: దుర్గేష్ మిగతా 3లో...

## అమరావతిలో డిజిటల్ మౌలిక సదుపాయాలు



- రాజధానిలో వేగంగా బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పనులు
- సీఆర్డీఏ అథార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రాజధానిలో బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన అనుమతుల విషయంలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. మిగతా 2లో...

## భూ హక్కుల పరిరక్షణలో ఏపీ దేశానికే ఆదర్శం



- రెండేళ్లలో రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలు
- రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల భూములపై హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. భూ హక్కులకు భద్రత, పారదర్శక సేవలు, ఖచ్చితమైన రికార్డులే లక్ష్యంగా గత రెండేళ్లలో రెవెన్యూ శాఖలో పలు విప్లవాత్మక సంస్కరణలు అమలు చేసినట్లు చెప్పారు.

సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. భూ పరిపాలన వ్యవస్థను ఆధునీకరించి ప్రజల ఆస్తులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు మిగతా 3లో...

## రూ.30 వేల కోట్లతో అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్

- అభివృద్ధి, ఉపాధి, పెట్టుబడులకు కేంద్రంగా అమరావతి రూపుదిద్దుకుంటోంది
- అమరావతిని కక్షతో నాశనం చేశారు.. మేము మళ్లీ నిర్మిస్తున్నాం
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు, జూన్ 19:** అమరావతిని గత ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలతో నాశనం చేసిందని, కూటమి ప్రభుత్వం తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకొస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

తాడికొండ నియోజకవర్గం పేరేచర్లలో నిర్వహించిన "రెండేళ్ల సుపరిపాలన - అభివృద్ధి సంబరాలు" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించే అభివృద్ధి కేంద్రంగా మారబోతోందని అన్నారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలకు పైగా భూములను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి సహకరించారని పేర్కొన్నారు. గతంలో అమరావతి అభివృద్ధిని నిలిపివేయడం వల్ల రైతులు, యువత, వ్యాపారవేత్తలు నష్టపోయారని విమర్శించారు.

ప్రజలు అమరావతిని అడ్డుకునే కుట్రలను ప్రజాస్వామ్య పద్ధతిలో తిరస్కరించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని నిర్మాణ పనులు మిగతా 3లో...

## నాసిరకం మందుల చెలామణిపై ఉక్కుపాదం

- గత రెండేళ్లలో కనిపించిన పురోగతితో అలసత్వం వద్దు
- ఉదాసీనంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవు
- ఏడాదికి 13వేల నమూనాల సేకరణ జరగాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు స్పష్టీకరణ
- విజయవాడలో ఘనంగా జరిగిన కొత్త స్టేట్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నాసిరకం ప్రాణధార మందులను త్వరగా గుర్తించి, వాటి విక్రయాలను నిరోధించడంలో విజయవాడలోని రాష్ట్ర ఔషధ పరీక్ష ప్రయోగాశాల కీలక పాత్ర పోషించబోతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మిగతా 2లో...

### కోల్ కతాలో మంత్రి లోకేష్

# పెట్టుబడుల వేట



**కోల్ కతా (జర్నలిస్ట్ ఫైల్) :** వెళ్ళేది ఏ కార్యక్రమమైనా ఏపీ బ్రాండ్ ను ప్రమోట్ చేయడమే ఏకైక లక్ష్యంగా రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ పని చేస్తున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి, మా యువతకు ఉద్యోగాలు ఇవ్వండి అంటూ రాష్ట్రాన్ని ప్రమోట్ చేస్తారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్లీనరీ సెషన్ లో పాల్గొనేందుకు మంత్రి లోకేష్ శుక్రవారం కోల్ కతా వెళ్లారు. ఆ కార్యక్రమంలో తమ ప్రసంగం పూర్తయిన వెంటనే పెట్టుబడుల వేట ప్రారంభించారు. మధ్యాహ్నం ప్లీనరీ సమావేశం తర్వాత కేవలం 5 గంటల వ్యవధిలో మంత్రి లోకేష్ 17 మంది పారిశ్రామికవేత్తలను కలిసి తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలు, అనుకూలతలను గురించి చెబుతూ లోకేష్ చేస్తున్న అభ్యర్థన పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది.

## అన్నదాతల ఖాతాల్లోకి సుఖీభవ



- **నేడు రూ.3,125 కోట్ల తొలి విడత సాయం విడుదల**
- **46.85 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి**
- **లింగంగుంట్ల నుంచి బటన్ నొక్కనున్న సీఎం చంద్రబాబు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2026-27 సంవత్సరానికి సంబంధించిన తొలివిడత సాయాన్ని ప్రభుత్వం శనివారం విడుదల చేయనుంది. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. వీరిలో 45,69,817 మంది భూ యజమాని రైతులు కాగా, 1,16,021 మంది అటవీ హక్కుల చట్టం కింద సాగు చేస్తోన్న =శిఖీ= రైతు కుటుంబాలు ఉన్నాయి. రూ. 3,125.47 కోట్లను రేపు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 2,342.92 కోట్లు కాగా... కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 782.55 కోట్లుగా ఉంది. గతేడాది ఈ పథకానికి రూ. 8,985.41కోట్లు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 6,560.18 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 2425.23 కోట్లు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలవుతోన్న ఈ పథకంతో అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ. 6 వేలు సమకూరుస్తోంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేస్తున్నారు. ఈ ఏడాది తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 వేలు, పీఎం కిసాన్ కింద కేంద్రం రూ. 2 వేలు కలిపి ఒక్కో రైతు ఖాతాలో రూ. 7 వేలు జమ చేయనున్నాయి.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఇలా :** అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 11.55 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు లింగంగుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలిస్తారు. అనంతరం 12.50 గంటల నుంచి 1.20 గంటల వరకు రైతులతో ముఖాముఖి అవుతారు. 2.15 గంటల నుంచి 3.45 గంటల వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశం అవుతారు. సాయంత్రం 3.50 గంటలకు ప్రజావేదిక సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు లింగంగుంట్ల నుంచి బయలుదేరి రాత్రి 6.20 గంటలకు క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు



(మొదటి పేజీ తరువాయి)

వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణ ప్రారంభ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఈ-ఆటోలు, కాంపాక్టర్స్, స్వీపింగ్ మిషన్లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. వచ్చే నెలాఖరులోగా ఇ-ఆటోలను, అక్టోబర్ నెలాఖరులోగా కాంపాక్టర్లను, స్వీపింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. మిద్దె తోటల విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం అధికారులకు సూచించారు. గోబర్ధన్ ప్లాంట్లు.. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల వంటి వాటి నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ తొలగింపులో లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే 33 సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల పనులు ప్రారంభమయ్యాయని.. మరో 148 ఎస్టీపీల పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు, అక్టోబరు మాసాల్లో ఎస్టీపీ ప్లాంట్లను అందుబాటులోకి తేవాలని సీఎం నిర్దేశించారు. మేజిక్ డ్రెయిన్లను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం, కాకినాడ, విజయనగరం, అనంతపురం, పిడుగురాళ్ల, వినుకొండ, మచిలీపట్నంలలో పనులు ముమ్మరంగా జరిగాయని అధికారులు సీఎంకు తెలియచేశారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్ గా పాల్గొన్నారు. పురపాలక శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్.... ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత

(మొదటి పేజీ తరువాయి)




ప్రస్తుతం భారతదేశం కీలక మలుపులో ఉంది. పశ్చిమ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. తూర్పు దేశాలు కూడా భారత్ వైపు చూస్తున్నాయి. మన జనాభా ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకునే సమయం ఇది.

**సంస్కరణల అమలులో ఏపీ ముందంజలో ఉంది :** మనకు అద్భుతమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ఉండడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నా. మన పొరుగు దేశాల్లో అనిశ్చితి, తరచూ ప్రధానమంత్రులు మారుతున్న పరిస్థితుల్లో.. మన దేశానికి స్థిరత్వాన్ని తీసుకొచ్చిన నాయకత్వం ఆయనది. జాతీయ స్థాయిలో సంస్కరణలను అమలు చేస్తున్న ఆయన.. వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి రాష్ట్రాలపై విశ్వాసం ఉంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కరణల అమలులో ముందంజలో ఉంది. భారతదేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయి.

**స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ ఏపీ ప్రత్యేకత :** పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ప్రత్యేకతలు ఏంటని చాలా మంది నన్ను అడుగుతారు. అందుకు మూడు 'ఎస్' లు కారణాలుగా చెబుతాను. మొదటి 'ఎస్'.. స్పీడ్. పెట్టుబడిదారులు ప్రభుత్వాలను హామీల ఆధారంగా కాదు.. నిర్ణయాలు ఎంత వేగంగా అమలవుతున్నాయనే దాని ఆధారంగా అంచనా వేస్తారు. మేం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశను దాటి.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలుచేస్తున్నాం. ఎందుకంటే పోటీ ప్రపంచంలో వేగమే కొత్త ప్రోత్సాహకం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో నిర్ణయాలు వేగంగా తీసుకోవడం, వాటిని మరింత వేగంగా అమలు చేయడం అనే సంస్కృతిని మేం నిర్మించాం. 13 నెలల్లోనే భారతదేశ అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి గూగుల్ ను ఏపీకి తీసుకువచ్చాం. ఒక్క జూమ్ కాల్ ద్వారా ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ సాధించగలిగాం. పుట్టిపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్ట్ కోసం 600 ఎకరాలు సేకరించి 37 రోజుల్లోనే శంకుస్థాపన చేయగలిగాం.

**కస్టమర్ ఈజ్ గాడ్ :** రెండో కారణం స్టెబిలిటీ. పరిశ్రమలకు అనువైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటాయని.. విధానాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తాయని పెట్టుబడిదారులు నమ్మాలి. ఆంధ్రప్రదేశ్ అలాంటి నమ్మకాన్ని అందిస్తోంది. మూడో కారణం సర్వీస్. సాంప్రదాయంగా ప్రభుత్వాలు తమను నియంత్రణ సంస్థలుగా భావిస్తాయి. కానీ మేం మమ్మల్ని సేవలందించే సంస్థలుగా భావిస్తున్నాం. మార్వాడీ సమాజంలో నాకు ఎప్పటినుంచో ఎంతో ఇష్టమైన ఒక భావన ఉంది. అదే 'కస్టమర్ ఈజ్ గాడ్'. మీరు మా కస్టమర్లు. మీకు సేవ చేయడానికే నేను ఇక్కడ ఉన్నాను.

**ఏపీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలి :** తరతరాలుగా మీరు అద్భుతమైన వ్యాపారాలను నిర్మించారు. ఒక బ్రాండ్‌ను నిర్మించడం ఎంత కష్టమో నాకు తెలుసు. పెద్ద ప్రాజెక్టులను విజయవంతంగా నిలబెట్టడం ఎంత సవాలుతో కూడుకున్నదో కూడా నాకు తెలుసు. అందుకే మేం మీకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని, కలిసి చరిత్ర సృష్టించాలని కోరుకుంటున్నాం. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు గారికి ఇప్పటికే మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆయన నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. హైదరాబాద్ లో 30 ఏళ్లలో జరిగిన అభివృద్ధి విశాఖ ఎకనామిక్ రీజియన్ 10 ఏళ్లలో సాధిస్తుంది. ఏపీలో ఇప్పటికే 24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాం. పెట్టుబడుల గ్రౌండింగ్ కు కృషిచేస్తున్నాం. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ ను నిర్మిస్తాం. ఆభరణాల తయారీకి సంబంధించి మొత్తం ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. జులైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించుకోబోతున్నాం.

**బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి :** జోన్లు, క్లస్టర్ల విధానంలో ముందుకు వెళ్తున్నాం. పరిశ్రమలకు అవసరమైన ఎకో సిస్టమ్ ను నిర్మిస్తున్నాం. ఇప్పుడు మీరు నెలలు, సంవత్సరాలు ఎదురుచూడాల్సిన పనిలేదు. ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్. ఏపీ శాసనసభ్యుల్లో 50శాతం మంది మొదటిసారి గెలిచిన వారు. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. నేను చంద్రబాబు గారి కేబినెట్ లో సీనియర్ మంత్రిని. రాష్ట్ర అభివృద్ధికి మేం అంతా కసితో పనిచేస్తున్నాం. మా మధ్య ఎలాంటి ఈగోలు లేవు. ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాం. నేను మీకు కేవలం ఒక వాట్సాప్ దూరంలోనే ఉన్నాను. మనమంతా కలిసి పనిచేసి.. ఒక గొప్ప పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను నిర్మించాలి. బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. మనమంతా కలిసి పనిచేసి.. భారతదేశాన్ని మరింత గర్వపడే స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(×జజ) ప్రెసిడెంట్, శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ సీఎండీ బ్రిజ్ భూషణ్ అగర్వాల్, ఐసీసీ వైస్ ప్రెసిడెంట్, సెంచరీ ప్లైబోర్డ్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశవ్ భజంక, సత్వ గ్రూప్ ఎండీ బిజయ్ అగర్వాల్, ఐసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, అంబుజా నియోటియా గ్రూప్ ఈడీ పార్థివ్ విక్రమ్ నియోటియాతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఒకే వేదికపై అటవీ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ అరణ్యారామం అటవీ, పర్యావరణ శాఖలకు సంబంధించి పరిశోధనలు, శిక్షణా కార్యక్రలాపాలతోపాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదిక నుంచి సమన్వయం చేసే కామన్ ఫెసిలిటీ సెంటర్ గా సేవలు అందించనుంది. రాష్ట్ర అటవీ పరిశోధన, శిక్షణ కార్యక్రమాలకు అరణ్యారామం వేదిక కానుంది. H.A.N.U.M.A.N. కార్యకలాపాలకు కమాండ్ సెంటర్‌గా, ఆంధ్రప్రదేశ్ గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమానికి పర్యవేక్షణ కేంద్రంగా, పులుల సంరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, జీవావరణ పునరుద్ధరణ, వాతావరణ స్థిరత్వం, ఎకో-టూరిజం అభివృద్ధి, డిజిటల్ పర్యావరణ పరిపాలన తదితర విభాగాలకు సమన్వయ కేంద్రంగా సేవలు అందించనుంది. అధునాతన సాంకేతికత సాయంతో ప్రకృతి పరిరక్షణ ధ్యేయంగా అరణ్యారామంలో శాస్త్రీయ పరిశోధనలు జరపనున్నారు. క్షేత్ర స్థాయిలో అమలు చేసే కార్యకలాపాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే పరిపాలనా కేంద్రంగా నిలవనుంది.

**హనుమాన్ గ్యాలరీల పరిశీలన :** శంకుస్థాపన అనంతరం అరణ్యారామం భవన నమూనా, నిర్మిస్తున్న ప్రదేశానికి సంబంధించిన వివరాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. మానవ, వన్యప్రాణి ఘర్షణలను నిలువరించేందుకు తీసుకువచ్చిన H.A.N.U.M.A.N ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్స్ వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఒక్క 2024 ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ 185 వన్యప్రాణి రక్షణ చర్యలు చేపట్టినట్టు అధికారులు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కి తెలియజేశారు. మరో 36 మానవ, వన్యప్రాణి సంఘర్షణ నివారణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, అటవీ శాఖ పీసీసీఎఫ్ పి వి చలపతి రావు, రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివ శ్రీనివాస్, పీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్య, బయో డైవర్సిటీ బోర్డ్ ఛైర్మన్ శ్రీ నీలాయపాలెం విజయ్ కుమార్, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మెంబర్ సెక్రటరీ ప్రొ. కె శరత్ కుమార్, అటవీశాఖ ఐటీ సలహాదారు శ్రీ పి.నాగబాబు, అటవీ శాఖ ఉన్నతాధికారులు రేవతి, రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### క్వాంటం టెక్నాలజీలో

# ఏపీ సరికొత్త చరిత్ర



(మొదటి పేజీ తరువాయి)

క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్‌లో అత్యంత శీతల ఉష్ణోగ్రత 4 కెల్విన్ (-269°C) స్థాయిని సాధించారు.

క్వాంటం కంప్యూటర్లు, అత్యాధునిక క్వాంటం పరికరాల అభివృద్ధికి అవసరమైన డైల్యూషన్ రిఫ్రిజరేషన్ టెక్నాలజీని స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడం ద్వారా ఏపీ కీలక ముందడుగు వేసింది. క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థలు పనిచేయడానికి అవసరమైన అత్యంత చల్లటి వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ ప్రత్యేక సాంకేతికత ఉపయోగపడుతుంది.

క్వాంటం చిప్స్, సూపర్‌కండక్టింగ్ పరికరాలు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం కమ్యూనికేషన్ పరికరాలు, క్రయోజెనిక్ ఎలక్ట్రానిక్స్ వంటి ఆధునిక పరికరాలను పరీక్షించే సదుపాయం అమరావతి ఫెసిలిటీ సెంటర్‌లో అందుబాటులోకి వచ్చింది.

గత ఏడాది సెప్టెంబర్‌లో మేధా టవర్స్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రారంభించిన క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్లు కేవలం ఏడాది కాలంలోనే క్రయోజెనిక్ టెక్నాలజీలో గణనీయమైన పురోగతిని సాధించాయి. Qbit Force, Qubitech సంస్థల ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి కొనసాగుతోంది.

క్వాంటం హార్డ్‌వేర్ టెస్టింగ్‌లో అమరావతి కేంద్రం దేశానికి తలమానికంగా మారనుందని, 85 శాతానికి పైగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను దేశీయంగానే తయారు చేసుకునేందుకు ఇది మార్గం సుగమం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, జాతీయ స్థాయి ల్యాబ్‌లకు అమరావతి క్వాంటం వ్యాలీ భవిష్యత్తులో కీలక కేంద్రంగా నిలవనుంది.

# నాసిరకం మందుల చెలామణిపై ఉక్కుపాదం




(మొదటి పేజీ తరువాయి)

గడిచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలవల్ల మార్కెట్ లోని మందుల దుకాణాలు, తయారీ సంస్థల నుంచి సేకరించే మందుల శాంపిళ్లు (నమూనాలు) బాగా పెరిగాయని, నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తోన్నందున నాణ్యత లేని మందుల చెలామణి క్రమంగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. సౌకర్యాలు మెరుగుపరచినందున తనిఖీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసి నాసిరకం మందుల చెలామణిని పూర్తిస్థాయిలో సకాలంలో ఉక్కుపాదంతో అణగదొక్కాలని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రజారోగ్య సంరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, వారి జీవన ప్రమాణాల్ని మెరుగుపరచేందుకు అధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు.

**రెండేళ్లలో పెరిగిన నమూనాల సేకరణ :** విజయవాడలో నూతనంగా నిర్మించిన రాష్ట్ర ఔషధ పరీక్ష ప్రయోగశాల, ఔషధ నియంత్రణ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల డ్రగ్ ల్యాబ్స్ అవసాన దశకు చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక విశాఖపట్నం, కర్నూలులో కొత్త ల్యాబ్ లను అందుబాటులోకి తెచ్చామన్నారు. విజయవాడలోని ల్యాబ్‌ను రాష్ట్ర స్థాయి ల్యాబ్‌గా తీర్చిదిద్దామన్నారు. రెండేళ్లకు ముందు ఏడాదికి 4వేల శాంపిళ్లను పరీక్షించేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం అదనంగా 800 నమూనాలను పరీక్షించడం మొదలైందన్నారు. అన్ని సౌకర్యాలతో రాష్ట్ర స్థాయి ల్యాబ్ గా విజయవాడ ల్యాబ్‌ను అప్‌గ్రేడ్ చేసినందున ఏడాదికి 13వేల నమూనాలను పరీక్షించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా కొత్త పోస్టుల ఆవశ్యకతను గుర్తించామని, ఆర్థిక శాఖతో సంప్రదించి సాధ్యమైనంత త్వరగా నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**అధికారులకు అభినందనలు... :** నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంవల్ల నాణ్యతలేని మందులు మార్కెట్లో గతంతో పోలిస్తే 2.13% నుంచి 1.02%కు తగ్గిందన్నారు. ఇందుకు కారకులైన అధికారులను అభినందిస్తున్నట్లు చెప్పారు అయితే ఈ శాతం ఇంకా తగ్గాల్సిన అవసరం ఉందని అధికారులకు స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించే వారిని ఏమాత్రం ఉపేక్షించేదిలేదని వెల్లడించారు. రాష్ట్ర స్థాయి ల్యాబ్ కు ఎన్ ఎబియల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) గుర్తింపును దక్కించుకునేందుకు అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

**ప్రజారోగ్యాన్ని గాలికి వదలేసిన నాటి వైకాపా ప్రభుత్వం :** గత వైకాపా ప్రభుత్వంలో ఈ కొత్త ల్యాబ్, ప్రధాన కార్యాలయ నిర్మాణాల విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. ప్రజారోగ్యంతో ముడిపడిన ఈ నిర్మాణాలను పూర్తిగా గాలికి వదలేసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రయోజిత పథకం(సియస్ఆర్) కింద 60:40 నిష్పత్తిలో నిధులు ( మొత్తం రూ. 22.048 కోట్లు) సమకూర్చేందుకు అంగీకరించిందన్నారు. ఇందులో భాగంగా 2018-19లో రూ. 4.5 కోట్లు వ్యయం చేయగా, ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా పట్టించుకోలేదన్నారు. ఐదేళ్ల వ్యవధిలో కేవలం రూ. 4.4 కోట్లు మాత్రమే గత వైకాపా పాలన లో ఖర్చు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం గడిచిన రెండేళ్లలో రూ. 11.3 కోట్లు ఖర్చు పెట్టి ల్యాబ్, ప్రధాన కార్యాలయాన్ని సిద్ధం చేసిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే జిల్లాల్లో నూతన కార్యాలయాల భవన నిర్మాణాలు, విశాఖపట్నం, కర్నూలులో కొత్త డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లు సిద్ధమైనట్లు చెప్పారు.

**ఐపీఎంతో అనుసంధానం :** కూటమి ప్రభుత్వం కల్తీ ఆహార పదార్థాల వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక దృష్టిని సారించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలను ఐపీఎం (ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్) తో అనుసంధానంచేసి, నాసిరకం మందులు, కల్తీ ఆహార పదార్థాలు, ఉత్పత్తుల్ని గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కల్తీ నెయ్యి ఘటనను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో రాష్ట్ర స్థాయి ల్యాబ్ ను ప్రారంభించామని తెలిపారు. ఐపీఎం ద్వారా మరో రెండు ల్యాబ్ లు సిద్ధం చేస్తున్నామన్నారు.

**వేధింపులకు గురిచేయొద్దు: సురేష్ కుమార్ :** ప్రజారోగ్య పరిరక్షణలో కొత్త ల్యాబ్ అనూహ్య మార్పులు తీసుకురాబోతుందని రాష్ట్రవైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, సురేష్ కుమార్ (ఎఫ్ఏసీ) మాట్లాడుతూ కొత్త నిర్మాణాలను భవనంగా కాకుండా వ్యవస్థగా చూడాలన్నారు. పోలీసు, మున్సిపల్, ఇతర శాఖల సహకారంతో డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రజారోగ్య సంరక్షణకు అవసరమైన చర్యల్ని తీసుకోవాలన్నారు. అలాగే... విధుల నిర్వహణలో వాస్తవాలకు తగ్గట్లు మాత్రమే వ్యవహరించాలని, అనవసరంగా ఎవరిని కూడా వేధింపులకు గురిచేయొద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా మందుల వినియోగంలో అత్యధికంగా ఉపయోగించే మందుల నమూనాల సేకరణ విధానం పటిష్టంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే.. రొటీన్ గా కాకుండా.. ఇతర మందుల నాణ్యత తనిఖీల విషయంలోనూ సమతుల్యత విధానాన్ని అవలంబించాలన్నారు. అవసరాలకు తగ్గట్లు డిజిటలైజేషన్ ద్వారా కార్యకలాపాల్ని పారదర్శకంగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమ వేదికను అలంకరించిన వారిలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్, డైరెక్టర్ ఆఫ్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పాండురంగ ప్రసాద్ (ఎఫ్ఏసీ), విశ్రాంత డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ విజయశేఖర్, ఏపీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ నెహ్రూ ఉన్నారు.

### అమరావతిలో డిజిటల్

# మౌలిక సదుపాయాలు

(మొదటి పేజీ తరువాయి)



సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. రాజధాని ప్రాంతంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో వివిధ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణాల అంశంపై చర్చించారు. బ్యాంకు కార్యాలయాల నిర్మాణాలకు సీఆర్డీఏ వైపు నుంచి పూర్తి సహకారాన్ని అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. బ్యాంక్ స్ట్రీట్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన 13 బ్యాంకుల్లో 11 సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకు అప్పగించారని అధికారులు సీఎంకు వివరించారు. పూర్తి సమన్వయంతో త్వరితగతిన ఈ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలని సీఆర్డీఏ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజధానిలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫోన్, కేబుల్, ఇంటర్నెట్ కనెక్టివిటీలకు సంబంధించి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రాజధాని అమరావతి నగరంలో పీపీపీ విధానంలో డిజిటల్ మౌలిక వసతులను ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. అమరావతిని నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా.. నివాస వ్యయం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పైప్డ్ గ్యాస్ కనెక్షన్ తో పాటు , ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని, డిస్ట్రిక్ట్ కూలింగ్ వంటి వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చెప్పారు. రాజధాని ప్రాంతంలో సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వరకు ఏడాది పొడవునా నీళ్లు ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. పర్యాటక అభివృద్ధికి జల క్రీడలు, స్విమ్మింగ్ తదితర కార్యకలాపాలకు పెద్ద ఎత్తున అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అథారిటీ సమావేశంలో కృష్ణా కరకట్ట నిర్మాణ పనులు, ఉండవల్లి గ్రామంలో ఎల్పీఎస్ లే అవుట్ల అభివృద్ధి, పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, జ్యూడిషియల్ అకాడెమీ నిర్మాణం, పౌల్ట్రీ ఫారంల స్ట్రక్చర్లకు చెల్లించాల్సిన పరిహారం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో మున్సిపల్, సీఆర్డీఏకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### భూ హక్కుల పరిరక్షణలో

# ఏపీ దేశానికే ఆదర్శం



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూ వివాదాల తగ్గింపు, సాంకేతికత ఆధారిత సేవలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు.

గతంలో రీ–సర్వేపై వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని గ్రామస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల 9వ తేదీన గ్రామాల్లో ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. భూయజమానుల సమక్షంలో సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల ధృవీకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.04 లక్షల ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. భూ హక్కుల భద్రత కోసం ఇప్పటివరకు 24 లక్షలకు పైగా పట్టాదారు పాస్‌బుక్కులు జారీ చేశామని, త్వరలో మరో 1.90 లక్షల పాస్‌బుక్కులు పంపిణీ చేస్తామని చెప్పారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పాస్‌బుక్కుల ద్వారా నకిలీలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు, నకిలీ లావాదేవీల నియంత్రణకు డిజిటల్ లాకింగ్ వ్యవస్థ, ఓటీపీ ఆధారిత ధృవీకరణ విధానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యూటేషన్ జరిగేలా ఆటో మ్యూటేషన్ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చామని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేస్తున్నామని చెప్పారు.

భూ ఆక్రమణలు, నకిలీ పత్రాలు, భూ మాఫియాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మంత్రి తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

భూ రికార్డుల్లో పారదర్శకత, వేగవంతమైన అనుమతుల వల్ల రాష్ట్రంపై పెట్టుబడిదారుల నమ్మకం పెరిగిందన్నారు. పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, పర్యాటక రంగాల అభివృద్ధికి అవసరమైన భూముల కేటాయింపులు చేపట్టినట్లు తెలిపారు.

భూమిపై యాజమాన్య హక్కు పూర్తిగా ప్రజలదేనని, ప్రజల హక్కులను రక్షించడమే ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్‌లో భూ సేవలను పూర్తిగా డిజిటల్, పేపర్‌లెస్ విధానంలోకి తీసుకెళ్లి దేశంలోనే అత్యుత్తమ భూ పరిపాలన నమూనాగా ఏపీని తీర్చిదిద్దుతామని తెలిపారు.

సమావేశంలో సీసీఎల్ఏ జయలక్ష్మి, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్వే అండ్ సెటిల్మెంట్స్ డైరెక్టర్ ఆర్. కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై గ్రీవెన్స్



- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన నాయకులు

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు మహమ్మద్ కుద్దూస్, జొన్నాదుల మహేష్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా పలువురు ప్రజలు పార్టీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను నాయకులకు వివరించి అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దూస్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## గాదె సాయి కృష్ణ అదృశ్యం ఘటనపై విచారణకు సీఎం చంద్రబాబు హామీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. తన కుమారుడి అదృశ్యం ఘటనపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

ఈ సందర్భంగా విజయలక్ష్మితో మాట్లాడిన ముఖ్యమంత్రి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ధైర్యం చెప్పి, ఈ విషయంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు.

తన కుటుంబానికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఏర్పడిందని తెలిపారు.

సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, నిందితులకు శిక్ష పడేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారని విజయలక్ష్మి పేర్కొన్నారు.

# రూ.30 వేల కోట్లతో అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్



(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ వేగం పుంజుకున్నాయని తెలిపారు.

ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో రూ.45 వేల కోట్లకు పైగా విలువైన మౌలిక వసతుల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అమరావతి చుట్టూ దాదాపు రూ.30 వేల కోట్లతో ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి కార్యాచరణ జరుగుతోందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కనెక్టివిటీ మెరుగుపడి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల అభివృద్ధి ద్వారానే యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పించగలమని పెమ్మసాని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు.

అమరావతి, పోలవరం, రైల్వేలు, జాతీయ రహదారులు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని, రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం నియోజకవర్గంలో ప్రగతి పరుగులు

- ఈదరపల్లి, నడిపూడి వంతెనలను ప్రారంభించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం(జర్నలిస్ట్ ఫైల్) :** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలో రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించింది. నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అత్యంత కీలకమైన ఈదరపల్లి వంతెన మరియు నడిపూడి వంతెనలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావుతో కలిసి శుక్రవారం ఘనంగా ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని అన్నారు. అమలాపురం నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఆనందరావుకి ఉన్న తపన, పట్టుదల వల్లే ఈ వంతెనల నిర్మాణం వేగంగా పూర్తయిందని కొనియాడారు. కోనసీమ ప్రాంత రవాణా రంగానికి, ఇక్కడి రైతాంగానికి, వ్యాపారులకు ఈ వంతెనలు ఎంతో మేలు చేకూరుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు ఆనందరావు మాట్లాడుతూ... అమలాపురాన్ని ప్రగతి పథంలో నడిపించడమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో ఈ వంతెనలు లేక ఈదరపల్లి, నడిపూడి, చుట్టుపక్కల గ్రామ ప్రజలు, విద్యార్థులు పడిన ఇబ్బందులను తానే స్వయంగా చూశానని, ఈరోజు ఆ కష్టాలు తీరడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని అన్నారు. తన విజ్ఞప్తిని మన్నించి నిధులు మంజూరు చేయడమే కాకుండా, స్వయంగా వచ్చి ఈ వంతెనలను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు గారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి అమలాపురం రూపురేఖలు మారుస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు. వంతెనల ప్రారంభోత్సవంతో ఈదరపల్లి, నడిపూడి ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తమ కలలను సాకారం చేసిన ఎమ్మెల్యే ఆనందరావు గారికి, మంత్రి అచ్చెన్నాయుడుకి ఈ ప్రాంత ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## లక్ష్యాన్ని మించి అదనంగా 1,56,555 యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

- 1,04,93,947కు గాను 1,06,50,502 రిజిస్ట్రేషన్ల నమోదు
- 23 జిల్లాల్లో వంద శాతం దాటిన రిజిస్ట్రేషన్లు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** యోగాంధ్ర–2026 రిజిస్ట్రేషన్లు లక్ష్యానికి మించి నమోదు అయ్యాయి. 1,04,93,947 లక్ష్యం కాగా శుక్రవారం సాయంత్రం నాటికి 1,06,50,502 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 28కి 23 జిల్లాల్లో నూరు శాతానికి మించి రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు, కడప జిల్లాలు పౌరుల రిజిస్ట్రేషన్ లో 100% నమోదుకు చేరువలో ఉన్నాయని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు వివరించారు. ఈ నెల 21న రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జరిగే యోగాసన కార్యక్రమాల్లో 1,04,93,947 మందిని భాగస్వాములను చేయడాన్ని జిల్లాల్లోని జనాభా ప్రాతిపదికన లక్ష్యాన్ని ప్రభుత్వం జిల్లాల అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది దీనికి అనుగుణంగా యోగాంధ్ర పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఆదివారంతో రిజిస్ట్రేషన్ల నమోదు పూర్తి కానున్న నేపథ్యంలో ముందుగానే లక్ష్యానికి మించి జరిగాయి. మార్కాపురం జిల్లాలో అత్యధికంగా 112.96% రిజిస్ట్రేషన్లు జరిగాయి.

## 22 కేంద్రాల్లో నీట్ పరీక్షలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో 22 పరీక్ష కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.

నీట్ పరీక్షకు జిల్లాలో 6609 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, పరీక్షలను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

అభ్యర్థులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిబంధనల ప్రకారం తనిఖీ చేయాలని, అనుమతిలేని వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరిసరాల్లోని జిరాక్స్ దుకాణాలను మూసివేయనున్నట్లు తెలిపారు.

పరీక్ష పర్యవేక్షణ బాధ్యతలను జాయింట్ కలెక్టర్ నిర్వహిస్తారని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పర్యవేక్షణ అధికారులను నియమించినట్లు చెప్పారు. కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రికార్డింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించాలని ఆదేశించారు.

# ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా ఏపీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మార్చి భారీ ఎత్తున ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. విజయవాడ భవానీపురంలోని బెర్మ్ పార్క్ లో ఉన్న ధరణి కన్వెన్షన్ హాల్ లో ఈ మేరకు మంత్రి దుర్గేష్ రెండేళ్ల సుపరిపాలనలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల పురోగతిపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, నూతన పర్యాటక పాలసీ 2024–29 విడుదల నుంచి 117 ప్రముఖ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకొని దాదాపు రూ.20,000 కోట్ల భారీ పెట్టుబడుల ఆకర్షణ వరకు, జాతీయ స్థాయి అవార్డుల నుంచి ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే 1,22,637 మందికి ప్రత్యక్ష,పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 4,390 హోటల్ గదులకు అదనంగా మరో 9,042 గదులు అందుబాటులోకి వచ్చేలా 50 కొత్త హోటళ్లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. అందులో భాగంగా నిర్మాణ దశలో ఉన్న 42 హోటళ్ల ద్వారా 48,168 ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పీపీపీ విధానంలో పర్యాటకాభివృద్ధి చేస్తున్నామని, అధికారుల సమిష్టి కృషితో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల గదులు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్యం నెరవేరితే దేశంలో టాప్–5 పర్యాటక రాష్ట్రాల్లో ఏపీ నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీచ్ శాక్ లో భాగంగా పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఫోర్స్ ను ఉపయోగించి వైన్, బీర్ సప్లై చేయాలని భావిస్తున్నామని తద్వారా టూరిజం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా విశాఖ, సూర్యలంక బీచ్ లలో ప్రారంభిస్తామన్నారు. అమరావతిలో సీఆర్డీఏ ల్యాండ్స్ ను పర్యాటకాభివృద్ధికి కేటాయిస్తామన్నారు. ఇప్పటికే 8 హోటల్స్ కు అనుమతులు మంజూరు చేశామన్నారు.

2019–24 మధ్య పర్యాటక రంగం వెనుకబడిపోయినప్పటికీ, దానిని ప్రత్యేక రంగంగా భావించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిని పూర్తిగా మార్చామన్నారు. గత రెండేళ్లలో దేశీయ పర్యాటకుల రాక 17 శాతం పెరిగి 37 కోట్ల ఫుట్‌ఫాల్ నమోదైందని, విదేశీ పర్యాటకుల సంఖ్య 2.62 లక్షలకు చేరిందని వెల్లడించారు. ఫలితంగా దేశంలో 16వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం 13వ స్థానానికి చేరుకుందని తెలిపారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిని యాంకర్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామని, 25 ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ల రూపకల్పన జరుగుతోందని వెల్లడించారు. క్రూయిజ్ టూరిజం, క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టేలు, అడ్వెంచర్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం వంటి రంగాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా ఏపీటీడీసీ బ్యాంక్ లోన్ ద్వారా 17 ప్రాంతాలలో ఉన్న రిసార్ట్‌లు / హోటళ్లలో ఆధునీకరణ పనులు చేపట్టామని, రూ. 125.53 కోట్లతో 600 గదులు, 11 రెస్టారెంట్లు, 8 బార్‌లు, 7 కాన్ఫరెన్స్ హాళ్లలో ఎక్స్‌టర్నల్




ఇల్యూమినేషన్ (బాహ్య విద్యుద్దీకరణ), పాత్‌వేస్ (నడకదారులు), ల్యాండ్‌స్కేపింగ్, సీసీ రోడ్లు, వాచ్ టవర్లు, కిచెన్ స్టోర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నాడు విశాఖ రుషికొండలో 58 గదులతో ఉన్న హరిత రిసార్ట్ ద్వారా పర్యాటక శాఖకు ఏటా 7.5 కోట్ల ఆదాయం వచ్చేదని, కానీ గత ప్రభుత్వం దాని స్థానంలో రుషికొండ ప్యాలెస్ నిర్మించడం వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. ఇటీవలే కేబినెట్ సబ్ కమిటీ రుషికొండను గతంలో మాదిరి రిసార్ట్ గా, ప్రజల సందర్శనార్థం వినియోగించాలని ప్రాథమికంగా నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం హోటల్స్ అన్నీ ఆపరేషన్ లోకి వస్తే పర్యాటక శాఖకు మరింత ప్రాఫిట్ వస్తుందని,ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు. టూరిజం సెక్టార్ 12 శాతం జీడీపీ గ్రోత్ సాధించిందన్నారు. టూరిజం హోటల్స్ లో ఆక్యుపెన్సీ పెరిగిందన్నారు. బీచ్ ల్లో, పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పర్యాటకుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక బీచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశామని మంత్రి దుర్గేష్ తెలిపారు. తీర ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పెంచి పర్యాటకులకు మరింత రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 1,855 హోమ్‌స్టేలను అనుసంధానం చేస్తూ ప్రత్యేక హోమ్‌స్టే పోర్టల్‌ను సిద్ధం చేశామని వివరించారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే క్రమంలో రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాల వద్ద టెంట్ సిటీల ఏర్పాటు ప్రతిపాదనను అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. దేశంలో తొలిసారిగా టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025ను ప్రవేశపెట్టి పారదర్శక పద్ధతిలో భూ కేటాయింపులు చేస్తున్నామన్నారు. ఇన్వెస్టర్లకు రాయితీలు కల్పించడంతో పాటు రాష్ట్రంలో క్యారవాన్ టూరిజం పాలసీ, హోమ్ స్టే, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ తదితర అనుబంధ పాలసీలు ప్రవేశపెట్టి ఆకర్షిస్తున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వం నుండి 8 పర్యాటక ప్రాజెక్టులకు రూ.428 కోట్ల నిధులు మంజూరయ్యాయని అన్నారు. వాటిలో స్వదేశీ దర్శన్ 2.0 క్రింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ. 97.52 కోట్లు,బొర్రా గుహలకు రూ. 29.87 కోట్లు,సాస్కి క్రింద అఖండ గోదావరి పునరుద్ధరణకు రూ. 94.44 కోట్లు, గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, ప్రసాద్ స్కీమ్ కింద అన్నవరం దేవస్థానానికి రూ. 25.32 కోట్లు, సింహాచలంకు రూ. 54.04 కోట్లు, అదే విధంగా సీబీడీడీ క్రింద అహోబిలం స్పిరిచువల్ ఒడిస్సీకి రూ. 24.96 కోట్లు, నాగార్జున సాగర్ బౌద్ధ సర్క్యూట్‌కు రూ. 25 కోట్లు మంజూరు కాగా ఆయా ప్రాంతాల్లో పనులను 2026 జులైలో పూర్తి చేయడమే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఏడాదంతా పర్యాటక శోభ ఉండేలా పర్యాటక ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇటీవల కేరళలో జరిగిన జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌కు 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు దక్కిందని తెలిపారు. అరకు వ్యాలీకి 'ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్‌స్కేప్' అవార్డు రావడం మరో గర్వకారణమన్నారు. టెంపుల్ టూరిజంతో పాటు ఎకో, బ్యాక్ వాటర్, బీచ్, కల్చరల్, అడ్వెంచర్, హెరిటేజ్, బుద్ధిస్ట్, కల్నరీ, క్రూయిజ్ తదితర టూరిజంలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 70 ప్రాంతాలను కవర్ చేస్తూ సాహస పర్యాటక కార్యకలాపాల అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఆల్ ఇండియా టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి సమావేశాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ 11, 12 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారని, ఇప్పటికే వారితో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. 2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని, జులైలో కర్టెన్ రైజర్ ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు. గోదావరి పుష్కరాలు భద్రతా పరంగా పకడ్బందీగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం కూడా ఇందుకు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సాంస్కృతిక రంగానికి పూర్వ వైభవం :** సాంస్కృతిక రంగానికి కూటమి ప్రభుత్వం పునర్వైభవం తీసుకొచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో రెండు విడతలుగా కళారత్న, ఉగాది పురస్కారాలు ప్రదానం చేశామని అందులో భాగంగా తొలి ఏడాది 86 మందికి కళారత్న, 116 మందికి ఉగాది పురస్కారాలు..రెండో ఏడాది 38 మందికి కళారత్న, 123 మందికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు, ఘంటసాల, గుర్రం జాషువా, టంగుటూరి ప్రకాశం పంతులు, బళ్లారి రాఘవ తదితర తెలుగు జాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుల జయంతులు, వర్ధంతులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. బుద్ధ జయంతి, ఎన్టీఆర్ జయంతి, స్వాతంత్ర్య సమరయోధుడు మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించామన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం రోజున ప్రముఖ భాషా కోవిదులు, కళాకారులకు ఘన సత్కారం చేశామన్నారు. కళాకారుల పెన్షన్ల పునరుద్ధరణ, కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మరియు సంగీత నాటక అకాడమీ సహకారంతో "కృష్ణవేణి సంగీత నీరాజనం" నిర్వహణ..మ్యూజిక్ టూరిజంకు నాంది పలికామన్నారు. తిరుపతిలో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ 10వ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 550 మంది కళాకారులతో రాజమండ్రిలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన చేసి రికార్డు సృష్టించామన్నారు.. బోయి భీమన్న మరియు గుర్రం జాషువా జయంతులలో ప్రముఖులకు విశిష్టపురస్కారాలు అందించామన్నారు. కొండపల్లి టాయ్స్ ఫెస్టివల్ తో పాటు పిఠాపురం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించామన్నారు. వియత్నాంలో బుద్ధుడి పవిత్ర అవశేషాల ప్రదర్శనలో కేంద్ర మంత్రి కిరణ్ రిజుజుతో కలిసి తాను భాగస్వామిని కావడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

రాష్ట్ర పండుగగా కోనసీమ జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రకటించి అద్భుతంగా నిర్వహించామన్నారు. ఇటీవల 51 మంది కవులతో కృష్ణమ్మ అలలపై కదులుతున్న పడవలో కవి సమ్మేళనం చేయడం గొప్పగా అనిపించిందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మ్యూజిక్ కాలేజ్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా యువతను మంచి మార్గంలో నడిపించాలని భావిస్తున్నామన్నారు. సాంస్కృతిక, పర్యాటక రంగాలను సమన్వయం చేస్తూ ఆరెంజ్ ఎకానమీ అభివృద్ధి చేస్తామన్నారు..తద్వారా రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతామన్నారు. 2027 జూన్ లో క్రియేటివ్ ఎకానమీపై ప్రత్యేక వర్క్ షాపు నిర్వహించాలని యోచిస్తున్నామని స్పష్టం చేశారు.

**త్వరలోనే నూతన ఫిల్మ్ పాలసీ.. ఏపీలో 100% షూటింగ్ జరుపుకుంటే భారీ సబ్సిడీ :** సినిమా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఎఫ్ డీసీ కమిటీ నేతృత్వంలో కొత్త ఫిల్మ్ పాలసీ కి రూపకల్పన జరుగుతుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గతంలో ప్రకటించి ప్రదానం చేయని నంది అవార్డులతో పాటు 2025 సంవత్సరం నుంచి మళ్లీ నంది అవార్డులను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్–డిసెంబర్ నెలల్లో నంది నాటకోత్సవాలను తప్పనిసరిగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అలాగే టీవీ, థియేటర్ అవార్డులు కూడా అందిస్తామన్నారు. తెలుగు సినిమా పరిశ్రమకు అవసరమైన స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ థియేటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సింగిల్ విండో విధానంలో భూములు కేటాయించి సినీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా నాటక రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాల ప్రదానం చేశామన్నారు. ఇప్పటికే 100 కోట్ల పైబడి బడ్జెట్‌తో నిర్మించే చిత్రాలకు రిలీజ్ అయిన మొదటి 10 రోజుల పాటు టికెట్ రేట్ పెంచుకునే సౌకర్యం కల్పించామని, రాష్ట్రంలో ఫిల్మ్ షూటింగ్స్ కు ఉచితంగా అనుమతులు ఇవ్వడంతో పాటు లో బడ్జెట్ చిత్రాలకు ముందుకు వచ్చేవారికి రిజిస్ట్రేషన్ చేసి త్వరితగతిన ఫ్రీగా షూటింగ్ అనుమతులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పదే పదే ప్రతి సినిమాకు టికెట్ పెంచుకునేలా ప్రత్యేక జీవోలు ఇవ్వకుండా త్వరలోనే సమగ్ర జీవో ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్న మంత్రి దుర్గేష్ 100 శాతం ఏపీలో షూటింగ్ లు జరుపుకునే చిత్రాలను గుర్తించి సంవత్సరానికి 15 చిత్రాలకు 10 లక్షల చొప్పున నగదు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో చిత్రాలను నిర్మించేందుకు అవసరమైన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామన్నారు.. ఇప్పటికే 9 యూనిట్స్ కు ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. 24 క్రాఫ్ట్స్ లలో పనిచేసే ఆర్టిస్ట్ ల డేటా బ్యాంక్ సిద్ధం చేస్తున్నామని తద్వారా స్థానిక ప్రతిభకు పెద్దపీట వేస్తామన్నారు.

ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, టూరిజం ఇంచార్జ్ ఎండీ పద్మావతి, ఈడీ శేషగిరి రావు, శిల్పారామం సీఈవో స్వామినాయుడు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జున రావు, ఎఫ్ డీసీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపూర్ గ్రామంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



**తంగళ్లపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి మండలం, రామచంద్రపూర్ గ్రామంలో విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసి, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంధం శ్రీనివాస్, ఉప సర్పంచ్ పొన్నాల నర్సింహులు, పంచాయతీ సెక్రటరీ ఈసరి లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు హ్యూమరా జాబిన్, ఉపాధ్యా యురాలు శారదా పాల్గొన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు మాట్లా డుతూ, ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని, పాఠ్య పుస్తకాలను జాగ్రత్తగా ఉపయోగించి విద్య లో ప్రతిభ కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లి దండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

## మీయొక్క వార్డులో ప్రతి ఒక్క కౌన్సిలర్ భాగస్వాములు కావాలి



**-మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య.**



**పెద్దపల్లి, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఒ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు గారి ఆదేశాల మేర కు నెల రోజులపాటు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్య్ర కమంలో భాగంగా గురువారం రోజు 1వ వార్డ్ మరియు 4వ వార్డ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనుల ను పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ విప్ ఒ ఎమ్మెల్యే విజ్జన్న గారి ఆదేశాల మేరకు పెద్దపల్లి పట్టణంలోని 36 వార్డుల్లో ప్రతి ఒక్క కౌన్సిలర్ నెల రోజుల పాటు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షాకాలం దృష్ట్యా మీ యొక్క వార్డులో ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే ఓపెన్ ప్లాట్స్ శుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు తెలియజేయాలని లేనియెడల అటువంటి ఓపెన్ ప్లాట్ యజమానులను గుర్తించి వారికి జరిమానా విధించడం జరుగుతుందని, మంచినీటికి ఇబ్బంది లేకుండా వాటర్ సప్లై సిబ్బంది చేత రోజువారి తనిఖీలు నిర్వహించాలని దయచేసి పట్టణ ప్రజలు మురికి కాలువల్లో ఓపెన్ ప్లాట్ లో చెత్త వేయకూడదని మీ వార్డ్ కు వచ్చే మున్సిపల్ ఆటో రిక్షాలకు అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు పురేల్ల శైలజ సుధాకర్, కొమ్ము సుధాకర్, వార్డ్ ఆఫీసర్లు నవ్య ప్రణిత, వెంకటేష్ శానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, ఆర్పీలు సంధ్య,ఆనంతుల పద్మ,లక్కీ రెడ్డి శోభ రాణి,వాటర్ లైన్ మెన్ కుమార్,శానిటేషన్ సిబ్బంది వేంకటస్వామి, రాజేందర్, శనిగారపు కమల చింతల రాజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు

## గోవిందుపల్లి గ్రామంలో అమ్మ మాట-అంగన్వాడి బాట



**జగిత్యాల రూరల్, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** గోవిందు పల్లి గ్రామంలో అమ్మ మాట- అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక కౌన్సిలర్ చీటి లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్య్ర కమానికి హాజరైన సూపర్వైజర్ శ్రీమతి నిర్మల గారు మాట్లాడుతూ మంచి చదువుతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలలో రెండున్నర నుండి ఆరు సంవత్సరముల పిల్లలను చేర్పించాలని తల్లులకు సూచించారు. కేంద్రంలో ఆటలు, పాటలు, కథల ద్వారా బోధిస్తూ వారి మానసిక వికాసాన్ని పెంచుతారని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు హరిత,గంగజమున, ఆయాలు మరియు తల్లులు పాల్గొన్నారు

## డిస్మిస్ కార్మికులకు వన్‌టైమ్ అవకాశం కల్పించాలి



**-సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం, యూనియన్లపై కార్మికుల ఆవేదన**

**రామ్ మందిర్ ఏరియా, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణిలో 2019 నుంచి 2022 మధ్యకాలంలో డిస్మిస్ అయిన కార్మికులందరికీ వన్‌టైమ్ సెటిల్మెంట్ ద్వారా తిరిగి ఉద్యోగాలు కల్పించాలని బాధిత కార్మికులు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం, యూనియన్ నాయకులను కోరారు. కరోనా కాలంలో కుటుంబ పరిస్థితులు, తల్లిదండ్రుల ఆరోగ్య సమస్యలు, స్వగ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తదితర కారణాల వల్ల గైర్హాజరు కావాల్సి వచ్చిందని, ఆ కారణంతో తమను డిస్మిస్ చేయడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తప్పును ఒక్కసారి క్షమించి మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2022లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేఎస్ నాయకులు డిస్మిస్ అయిన కార్మికులకు మస్టర్‌తో సంబంధం లేకుండా మరో అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి, సింగరేణి వ్యాప్తంగా డిస్మిస్ అయిన 186 మంది కార్మికులకు ఒకేసారి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రకటించారని తెలిపారు. అయితే, అనంతరం సింగరేణి యాజమాన్యం, టీబీజీకేఎస్ మధ్య జరిగిన చీకటి ఒప్పందం ఫలితంగా 2023 సెప్టెంబరులో '200 మస్టర్ విధానం' సర్క్యులర్ విడుదల చేసి తమను మోసం చేశారని ఆరోపించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపాలపల్లిలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిస్మిస్ అయిన 186 మందికి మరో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసినా హామీలు మాత్రమే వస్తున్నాయని, ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి లేదన్నారు. గత ఐదేళ్లుగా తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, పిల్లల ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ తల్లిదండ్రులు సింగరేణి అభివృద్ధికి దశాబ్దాల పాటు సేవలందించారని, తెలిసీ తెలియక చేసిన తప్పుకు కక్షసాధింపు చర్యలు సరికాదన్నారు. యూనియన్ నాయకులు చొరవ తీసుకొని వన్‌టైమ్ సెటిల్మెంట్ ద్వారా డిస్మిస్ అయిన కార్మికులందరికీ తిరిగి ఉద్యోగావకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శ్రీకాంత్, శ్రీనివాస్, రాందాస్, యుగంధర్, పోషమల్లు, షారుఖ్, సతీష్, నరసయ్య, సంతోష్, భరత్ తదితరులు పాల్గొన్నారు

## అమ్మ మాట.. అంగన్వాడి బాట



**రాయికల్, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రెండున్నరేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని జగిత్యాల ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మావతి సూచించారు. రాయికల్ మండలం వడ్డెర కాలనీ (శివాజీనగర్) అంగన్వాడి కేంద్రంలో గురువారం నిర్వహించిన 'అమ్మ మాట--అంగన్వాడి బాట' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాల్లో నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య అందిస్తున్నామని తెలిపారు. ఆటలు, పాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో మేధో వికాసం, సాధారణ విజ్ఞానం పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్, ఉపసర్పంచ్ బోదాసు రాజేష్, వార్డు సభ్యులు మాధురి మురళి, గ్రామ కార్యదర్శి అమీర్, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి,ఉపాధ్యాయురాలు నవ్యశ్రీ, అంగన్వాడి టీచర్ బియ్యని సుజాత, ఆయమ్మ లక్ష్మి, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ బీఎల్ఏల ముఖ్య సమావేశం



**-రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**

**తాండూర్, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు, అనంతరం బీఎల్ఏల ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదారం రోడ్‌లోని సురభి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:00 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా డీసీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి హాజరవుతున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య... విద్యతోనే అన్ని సాధ్యం. సర్పంచ్ మణెమ్మ -శ్రీనివాస్

**-విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు పంపిణీ**



**పెగడపల్లి, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు బుక్కులు గ్రామ సర్పంచ్ బండారి మణెమ్మ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, విద్య కమిటీ చైర్మన్ లత, అంగన్వాడీ టీచర్స్, గ్రామ పాలకవర్గ సభ్యులు ఉపాధ్యాయులు తో కలిసి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు బాలలే రేపు భావి తరాలను మార్చే పౌరులు అని అన్నారు. ప్రభుత్వ పాఠశాల లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్య నేర్పుతో అన్ని సాధించవచ్చని, విద్య లేకపోతే భవిష్యత్తే శూన్యమని అన్నారు. మన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యే విధంగా ఇంగ్లీషులో బోధించడం జరుగుతుందని, అలాగే మధ్యాహ్నం భోజనం పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశించిన విధంగా పిల్లలకు అందుబాటులో ఉంచి మంచి రుచికరమైన భోజనాన్ని పెట్టడం జరుగుతుందని, పాఠశాలలో ఆటస్థలం కూడా చాలా విశాలంగా ఉందని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉపాధ్యాయులు చూసుకోవడం జరుగుతుందని,గ్రామంలోని విద్యార్థిని విద్యార్థులు అందరూ మన ఊరి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులను కోరడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి సీతక్కను కలిసిన రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తుల ప్రదీప్



**పెగడపల్లి, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లాలో పంచాయ తీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ఉప సర్పంచ్ లవ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు రాము నాయక్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తుల ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఉప సర్పంచ్ ల చెక్ పవర్ పై వస్తున్న తప్పుడు వార్తలను ఎవరు కూడా నమ్మరాదని, కచ్చితంగా ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని మంత్రి అన్నారు. ఎవరు కూడా ఎవరికీ డబ్బులు ఇవ్వరాదని మాయమాటలు నమ్మి ధర్నాలు చేయరాదని గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచుల వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల మహేష్, ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తుల ప్రదీప్, బందు యాకయ్య, దావు సంపత్ రెడ్డి, అధికార ప్రతినిధి గుర్రం శ్రీధర్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, నల్గొండ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ములుగు జిల్లా అధ్యక్షులు సంజన, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, రాజా బాయ్, నాగరాజు, వెంకన్న, జానీ భాయ్, తిరుపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ. సర్పంచ్ అరుణ- శ్రీనివాస్



**పెగడపల్లి, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఓరుగల అరుణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను, నోటుబుక్కులను, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీషులో విద్యను అందిస్తున్నారని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ డాక్టర్ బత్తుల ప్రదీప్, వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం..



**పటాన్‌చెరు, జర్నలిస్ట్ ఫైల్:** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన గడప ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వ్రుద్వీరాజ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు రామ్మోహన్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు

# ఖబర్దార్ కేటీఆర్ ఖమ్మం గడ్డపై నీ జిమ్మిక్కులు నడవవు

- రాష్ట్ర మంత్రులపై బురదజల్లే ప్రయత్నాలు మానుకో
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర మంత్రులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ పాలేరు సభ వేదికగా చేసిన ఆరోపణలు ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. కేటీఆర్ వ్యాఖ్యలపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ కేటీఆర్ పాడిందే పాడరా, పాచిపండ్ల దాసరా అన్నట్టు అవే అబద్ధాలను పదే పదే చెబితే నిజాలు మారవు, అంటూ మండి పడ్డారు. తెలంగాణ యాసలో మాట్లాడితే పదేళ్ల మీ అవినీతి, అక్రమాలను ప్రజలు మరిచిపోతారని భావించడం భ్రమేనని స్పష్టం చేశారు.మట్టి గుట్టలకు, రోడ్లకు రైతుబంధు నిధులు మళ్లించింది మీరు కాదా? అమెరికాలోని ప్రవాస భారతీయుల వందల ఎకరాల భూములకు రైతుబంధు చెల్లించింది మీ ప్రభుత్వమే కాదా? అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. స్కీముల పేరుతో స్కాములు చేసి లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టింది, ధరణి పేరుతో వేల ఎకరాల భూములపై దందాలు నడిపింది బీఆర్ఎస్ పాలనేనని ఆరోపించారు. మాటల గారడీలో పీహెచ్‌డీ చేసి ఉండొచ్చు, కానీ ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయొద్దు నాయనా, అంటూ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆర్థిక విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, ఆ పాపాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు.ముగ్గురు మంత్రులు జిల్లాలో ప్రజల మధ్య తిరుగుతూ నిరంతరం సమస్యలు పరిష్కరిస్తున్న నాయకులని సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజాదర్బార్ల ద్వారా వేలాది సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్న సేవాభావాన్ని చూసి ఓర్వలేకే కేటీఆర్ విషప్రచారం చేస్తున్నారని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి పల్లెలో జరుగుతున్న



అభివృద్ధి పనులే కేటీఆర్ విమర్శలకు సమాధానమని పేర్కొన్నారు.బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనే కలలు రాత్రిళ్లు నిద్రపోయేటప్పుడు మాత్రమే కనండి నాయనా, తెలంగాణ ప్రజలు ఇప్పటికే మీకు తీర్పు చెప్పారు అంటూ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ అడ్డుపెట్టి రాజకీయం చేయాలన్న కేటీఆర్ ఆశలు ఎప్పటికీ నెరవేరవని స్పష్టం చేశారు. మా త్రిమూర్తుల ఇలాఖా అయిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చి అడ్డగోలు ప్రసంగాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చూసుకో, కాచుకో, నీ రాజకీయ జిమ్మిక్కులు ఇక్కడ నడవవు ఖబర్దార్ కేటీఆర్, అంటూ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.

# డెంగ్యూ, మలేరియా నియంత్రణకు సమిష్టి చర్యలు అవసరం

## - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు

**ఖమ్మం, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** డెంగ్యూ, మలేరియా లాంటి వాటిని నియంత్రించే వరకు సమిష్టిగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు ఖమ్మం, న్యూ కలెక్టరేట్, (ఐడిఓసి ) కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ, ఎస్ ఓ లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకొని పరిసరాల పరిశుభ్రత నిల్వ నీటి తొలగింపు, యాంటీ లార్వా చర్యలు, ప్రతి మంగళవారం శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం కొనసాగుతున్న స్టాప్ డయేరియా క్యాంపైను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి ఇంటికి ఓ ఆర్ ఎస్, జింక్ టాబ్లెట్స్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న పల్స్ పోలియో ప్రోగ్రాంను విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్క చిన్నారి పోలియో చుక్కలు మిస్ కాకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమానికి సంబంధించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకొని అర్హులైన పిల్లలందరికీ ఆల్ బెండజోల్ మాత్రలు అందించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.మాతా–శిశు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణుల ఎర్లీ రిజిస్ట్రేషన్ కనీసం నాలుగు ఏ ఎన్ సి చెక్ అప్స్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.



సమావేశం అనంతరం డా. డి. రామారావు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలాజీ నగర్ ను సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులను స్వయంగా పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, వైద్యులు, సిబ్బందికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఆరోగ్య శాఖకు చెందిన ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ మోతియా, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ప్రతాప్ సంపత్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ఎల్ గోపాల్ రెడ్డి, ఎస్ ఓ పి వీరయ్య, డాక్టర్ అరుణాదేవి, డిపిఓ దుర్గ డెమో సుబ్రమణ్యం, (డిప్యూటీ డి ఎం హెచ్ ఓ) తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అష్టకష్టాలే

## - ఎంపి వద్దిరాజు రవిచంద్ర ఆవేదన

**ఖమ్మం, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నారని,అన్ని వర్గాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ విజయ దుందుభి మోగించడం తథ్యమని ధీమాగా చెప్పారు.ఎంపీ రవిచంద్ర కొత్తగూడెంలో గురువారం సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్), సభ్యత్వ నమోదుపై పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంఛార్జి, శాసనమండలి సభ్యులు తక్కళ్లపల్లి రవీందర్ రావు,మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావులతో కలిసి కార్యకర్తలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఉమ్మడి జిల్లాను ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు అభివృద్ధి,ప్రజా సంక్షేమాన్ని గాలి కొదిలేసి సొంత ప్రయోజనాలపై దృష్టి సారించారని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో చేసిన అభివృద్ధే తప్ప ఉమ్మడి జిల్లాలో ఏ పనులు కూడా ముందుకు సాగడం లేదన్నారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు రంగులు వేసి రిబ్బన్ కటింగులు చేసుకుని ప్రారంభించుకున్నారని ఎంపీ వద్దిరాజు దుయ్యబట్టారు. అమలు కానీ 432 హామీలిచ్చి ప్రజల్ని మభ్యపెట్టి,మోసం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. "రైతుబీమా"ను



పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసిందని,"రైతు భరోసా"ను సక్రమంగా అమలు చేయడం లేదని, రైతులు యూరియా కోసం రోజుల తరబడి పడి కాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సర్కార్ ఉద్యోగ నియమాకాల నోటీఫికేషన్లు ఇవ్వకపోవడంతో నిరుద్యోగ యువత ఆందోళన బాటపట్టారని, ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. కేసీఆర్ సంపూర్ణ సహకారంతో వనమా వెంకటేశ్వరరావు కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు.కొత్తగూడెంను రైల్వే డివిజన్ గా ప్రకటించాలని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసి కోరడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.తమకు గిట్టని వారి ఓట్లను తొలగించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం "సర్" పేరుతో భారీ ఎత్తున ఓట్లను తొలగించే ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ఇప్పటికే పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.తెలంగాణలో కూడా అదే చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని, అటువంటి



ఆటలు ఇక్కడ సాగకుండా మనమందరం మరింత అప్రమత్తంగా ముందుకు సాగుదామని ఎంపీ రవిచంద్ర అన్నారు.ప్రతి ఒక్కరు తమ ఓటును ఇక్కడే ఉండేలా జాగ్రత్త వహించాలని,ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ బూత్ ఏజెంట్లు సభ్యులు ప్రతి నిత్యం ఓటర్లతో ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ హక్కుపై మమేకమవుతూ చైతన్యం పాదుగొల్పాలని గులాబీ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.ఇకముందు ఏ ఎన్నికలు జరిగినా కూడా బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగల రాజేందర్,కిలారి నాగేశ్వరావు,వనమా రాఘవేంద్రరావు,కాపు సీతామహాలక్ష్మి ,వేల్పుల దామోదర్,కాపు కృష్ణ, బండారు రుక్మేందర్,బాదావత్ శాంతి,కార్పోరేటర్లు గోవాడ గుణచరిత్, వేల్పుల వీరమ్మ సింధు తపస్వి, మధు చంద్,రాంబాబు, మల్హోత్రా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఖమ్మం అర్బన్ పోలీసులు





**ఖమ్మం, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** నేరాల నియంత్రణ, భద్రతా చర్యల్లో భాగంగా ఖానాపురం హవెలి ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుర్తింపు పత్రాలు రిజిస్టర్ ఎంట్రీలు, సీసీటీవీ కెమెరాల పనితీరు, చెక్–ఇన్, చెక్–అవుట్ సమయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జీ యాజమాన్యం గెస్టల నుండి ఒరిజినల్ గుర్తింపు కార్డులను పరిశీలించి, వాటి జిరాక్స్‌లను భద్రపరచాలన్నారు. సరైన గుర్తింపు లేకుండా ఎవరికీ గదులు కేటాయించ కూడదన్నారు. హోటల్ ప్రవేశ ద్వారాలు, ఎగ్జిట్ గేట్లు, రిసెప్షన్ ప్రాంతాలలో హెచ్‌డీ (హెచ్ డి) సీసీటీవీ కెమెరాలు 24/7 పనిచేసేలా చూడటం యాజమాన్యం బాధ్యతని అన్నారు. లాడ్జీలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు లేదా అసాధారణ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే, యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సరైన రికార్డులు నిర్వహించని, భద్రతా ప్రమాణాలను పాటించని లాడ్జీల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బల్లెపల్లి గణేష్ టౌన్ షిప్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.

# జవహార్ నవోదయలో ఇంటర్ ప్రవేశం సాధించిన సత్యశోధక్ విద్యార్థిని లక్షి సహస్ర

## -అభినందించిన ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య

**సిరికొండ, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం లోని సత్యశోదక్ పాఠశాల విద్యార్థి ని లక్షి సహస్రకామారెడ్డి జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ (11వ తరగతి) ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఈ. లక్షి సహస్ర ప్రతిభ కనబరిచి ఎంపికైంది.పదవ తరగతిలో 562 మార్కులు సాధించిన లక్షి సహస్ర, జవహర్ నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన ప్రవేశ ప్రక్రియలో అర్హత సాధించి ఇంటర్మీడియట్ విద్యకు



ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థిని సాధించిన విజయం ఆమె కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. లక్షి సహస్ర విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# యోగ విన్యాసాల పోటీల నిర్వహణ



**నిజామాబాద్, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** 12 వ అంతర్జాతీయ యోగ దినోత్సవంను పురస్కరించుకొని గురువారం నిజామాబాదు పట్టణంలోని సుభాష్ నగర్ లోని దయానంద యోగ కేంద్రంలో యోగ విన్యాసాల పోటీలు నిర్వహించడం జరిగిందని యోగ ఆయుష్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.గంగా దాస్ తెలిపారు.విన్యాసాల పోటీలలో గెలుపొందిన వారికీ ఆదివారం రోజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందచేస్తామని,జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు యోగ ప్రభాకర్ మాట్లాడుతూ..విద్యార్థులు చిన్నప్పటి నుండి యోగ సాధన చేస్తూ విన్యాసాల పోటీలలో పాల్గొని ప్రతిభ చూపాలని చక్కని ఆరోగ్యానికి యోగతో మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యోగ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రాంచందర్,జిల్లా యూత్ ఆఫీసర్ రమేష్,ఆయుష్ వైద్యులు డా.శ్రీవాణి,వెంకటేష్,తిరుపతి,ఆయుష్ డీపీఎం వందన,ఆయుష్ ఫార్మా సిస్ట్స్ లు ఆయుష్ పురుషోత్తం,ఉమప్రసాద్,యోగ గురువులు సంగీత,శ్రీనివాస్,యోగ గురువులు,ఆయుష్ స్టాఫ్,విద్యార్థి,విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**- పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న లంక లక్ష్మీకాంత్ రెడ్డి**





**వికారాబాద్, జూన్ 19 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు ఆలంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ లంక లక్ష్మీకాంత్ రెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు.అలాగే పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి సమయానుకూలంగా సహాయం అందించడం ద్వారా వారి చదువుపై ఆసక్తి మరింత పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలంపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ కుమార్, మాజీ కౌన్సిలర్ బుచ్చిబాబు గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపగా, పాఠశాల సిబ్బంది కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు

# ఆదర్శ పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణి






**నిజామాబాద్ రూరల్, (జర్నలిస్ట్ ఫైల్) :** సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు& రాత పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీచైర్మన్ కాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను & రాత పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మల్లెల సాయిచరణ్ మాట్లాడుతూ, "విద్యార్థుల జీవితాలను ఉన్నత శిఖరాలకు చేర్చే గొప్ప సాధనం విద్య. పాఠ్యపుస్తకాలు జ్ఞానానికి ద్వారాలు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలి" అని సూచించారు.ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కాంతమ్మ మాట్లాడుతూ, "పుస్తకాలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకాలు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని" విద్యార్థులకు పిలుపునిచ్చారు.ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు& రాత పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.పాఠశాల విద్యా ప్రమాణాల పెంపు కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గడ్డం రాజేష్ రెడ్డి,సర్పంచ్ మల్లెల సాయిచరణ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కాంతమ్మ, వార్డ్ మెంబర్ మురళి,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా చైతన్యానికి నాంది పలికిన పుస్తకాల పంపిణీ




**కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) :** కేశంపేట మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో విద్యార్థుల విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు మరియు ఇతర విద్యా సామగ్రిని అందజేసి చదువుపై ఆసక్తిని పెంపొందించేలా ప్రోత్సహించారు.కార్యక్రమంలో సర్పంచ్ మామిడిపల్లి భాస్కర్, డిప్యూటీ సర్పంచ్ సప్న మాట్లాడుతూ.. విద్యే జీవితానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు శివ, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గ్రామ పెద్దలు తట్టెపల్లి సత్తయ్య, కానుగుల రవి, పోతాల్లా రాజు, అనూష, సుమలత, లక్ష్మమ్మ, అరుణ, తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లకు శిక్షణ తరగతులు

**- తప్పిదాలకు తావులేకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి**






**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో గురువారం నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు,సూపర్వైజర్లు,సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు.ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి,ఏయే అంశాలను పరిశీలించాలి,ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ,పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుండి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని,ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని,ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు.ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని,ఇలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు.ప్రతి ఓటరుకు రెండు చొప్పున ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని,వాటిని ఓటరు సరైన విధంగా పూరించారా అన్నది పరిశీలించాలని అన్నారు.పూరించిన ఒక ఫారంను తీసుకుని,మరో ఫారంను ఓటరుకు ఎక్ నాలెడ్జ్ రూపంలో అందించాల్సి ఉంటుందన్నారు.ఇప్పటికే ప్రీ-మ్యాపింగ్ చేసుకున్న ఓటర్లకు సంబంధించి కూడా ఏవైనా మార్పులు చేయాల్సి ఉంటే,వాటిని సరి చేయవచ్చని తెలిపారు.ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలన్నారు.అక్టోబర్ 1 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తవుతున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడుతుందని,ఈ మేరకు కొత్త ఓటర్లు ఉంటే ఫారం-6 తో పాటు ధృవీకరణ పత్రం తీసుకోవాలని తెలిపారు.ఉపాధి నిమిత్తం విదేశాలలో ఉంటున్న వారి ఎన్యుమరేషన్ ఫారంపై వారి కుటుంబ పెద్ద సంతకం తీసుకోవచ్చని సూచించారు.01 జూలై 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని,తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు.01 జూలై 1987 నుంచి 02 డిసెంబర్ 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి,తాతయ్య లేదా నానమ్మ ఎవరిదైనా ఒకరి ధ్రువపత్రం సమర్పించాలని,02 డిసెంబర్ 2004 తర్వాత జన్మించిన వారు స్వీయ ధృవీకరణతో పాటు తల్లిదండ్రులు ఇద్దరి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని,ముసాయిదా జాబితా అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, దరఖాస్తులను పరిష్కరించి, అక్టోబర్ 01న తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు.నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో బీ.ఎల్.ఓల కృషితో జిల్లాలోనే అత్యధికంగా ప్రీ-మ్యాపింగ్ 93.5 శాతం జరిగిందని,ప్రస్తుత చివరి దశలో ఇదేవిధమైన కృషిని కొనసాగిస్తూ వంద శాతం మ్యాపింగ్ జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు.షెడ్యూల్ మేరకు నిర్ణీత గడువు లోపు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పక్కాగా పూర్తయ్యేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఈ.ఆర్.ఓలు,ఏ.ఈ.ఆర్.ఓలకు సూచించారు. శిక్షణా తరగతులలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు, బీ.ఎల్.ఓలు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# తెలంగాణలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణం

- జిల్లాలోని ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపు పై దృష్టి సారించాలి..
- పసుపు బోర్డ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్..
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ...



**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ గవర్నర్,మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు.గురువారం ఆయన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ నివాసానికి విచ్చేశారు.ఈ సందర్భంగా మాజీ గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ....తెలంగాణలో ఉన్న 19 విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయన్నారు.అలాగే విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు అందకపోవడం వల్ల పరిశోధన ప్రయోగశాలలు,గ్రంథాలయాలు,ఇతర మౌలిక సదుపాయాలు ఘోరంగా ఉన్నాయన్నారు.బడ్జెట్లో విద్యకు నిధులు కూడా అంతంత మాత్రమే కేటాయించడం దారుణం అన్నారు.2026-27 బడ్జెట్లో విద్య రంగానికి కేవలం 8.2 శాతం మాత్రమే కేటాయించడం తగదన్నారు.తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సిఫారసు ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో కనీసం18 శాతం విద్యకు కేటాయించాలని సూచించిందని గుర్తు చేశారు.జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవనాడి అని మాజీ గవర్నర్ దత్తాత్రేయ తెలిపారు.ఈ ప్రాజెక్టు ద్వారా గతంలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడిందని,ప్రాజెక్టు ప్రభావం ఆయకట్టు మార్పులు ఇతర కారణాలవల్ల ప్రస్తుతం ఆయకట్టు 2.35 లక్షల ఎకరాలకు తగ్గిందన్నారు.ప్రధానంగా పూడిక తొలగింపు,కాలువల,ఆధునీకరణ నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అలాగే మోర్తాడ్ బాల్కొండ ఆర్మూర్ ప్రాంతాల రైతులు ఇప్పటికీ సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పెద్ద వాగు వంటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నిర్మించి ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ పై అనేక హామీలు ఇచ్చిందన్నారు.కానీ రెండున్నరేళ్లు గడిచిన దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.పసుపు రైతులతో సమావేశం...జిల్లా పసుపు రైతులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో జిల్లాలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.బోర్డు ద్వారా పసుపు ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెరిగిందన్నారు.ప్రధానంగా ఎగుమతులు పెరగడం,విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం లభించడం,రైతులకు మెరుగైన ఆదాయం అందడం వంటి ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. పార్టీ కోసం బూతు స్థాయి కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ కష్టపడాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు ఆయన సూచించారు.పదవులు ఉన్నా లేకున్నా పార్టీ కోసం పని చేయాలన్నారు.భవిష్యత్తులో మహిళా బిల్లు,డిలివిటేషన్ కచ్చితంగా అమలవుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా,జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి,రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి,సీనియర్ నాయకులు భూపతి రెడ్డి,టక్కర్ హనుమంత్ రెడ్డి,బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్,ముక్కా దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్‌డేలో వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను ఎస్పీకి అందించారు.

సిబ్బంది నుంచి వచ్చిన ప్రతి వినతిని ఎస్పీ పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఖాళీలు, అవసరాలు, పారదర్శక విధానాలను పరిగణనలోకి తీసుకుని బదిలీల ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు.

ఎటువంటి సంకోచం లేకుండా తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమస్యలు పరిష్కారమైతేనే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు.

పోలీస్ శాఖ ఒక కుటుంబం వంటిదని, పరస్పర గౌరవం, సహకారం, సమన్వయంతో పనిచేస్తే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**○ ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ**

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం వినుకొండ ఎంపీడీవో ఆఫీస్ నందు శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు ప్రజా దర్బార్ కు హాజరై వారి సమస్యలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకు విన్నవించుకున్నారు.

ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు. 43 అర్జీలు వచ్చాయి వినుకొండ మండలంతోపాటు గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్స్, సిసి రోడ్స్, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు.

ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వం గా ప్రజల మన్ననలు పొందిందన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో రాహుల్ గాంధీ గారి 56వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ ఇంచార్జ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజా సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, మండల ప్రెసిడెంట్ పినపాటి స్టీవెన్ బాబు, బీసీ సెల్ అధ్యక్షుడు దోగిపర్తి శ్రీనివాసరావు, పెనుగొండ శివకుమార్ భీమా రమేష్ నక్క మాధవరావు,కట్ట వీరస్వామి, కార్తీక్ పూలే,రామ్ ప్రసాద్,బి శ్రీను ఎన్ మల్లికార్జునరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే నసీర్

**○ అన్ని వ్యవస్థలు జవాబుదారీగా ఉండాలి**

**○ త్వరలో నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ**

**○ ఇప్పటికే అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు**

**○ రెండేళ్ల పాలనపై సంతోషం వ్యక్తం చేస్తోన్న ప్రజలు**

**○ ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు అన్ని వ్యవస్థలు జవాబుదారీగా ఉండాలని, అప్పుడే సమస్యలు సకాలంలో పరిష్కారమవుతాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా స్వీకరించారు. నూతన పింఛన్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు, మురుగు నీటి సమస్య, విద్యుత్ స్థంభాల ఏర్పాటు వంటి వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలపై వెంటనే ఎమ్మెల్యే నసీర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆయా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు. త్వరలో నూతన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం అందించబోతోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే స్పౌజ్ కేటగిరీ కింద భార్యాభర్తల్లో ఒకరు మరణిస్తే వెంటనే భాగస్వామికి అందించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెల వ్యవస్థను తీసుకొచ్చిందని, మండల, జిల్లా స్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలకు సంతృప్తికరస్థాయిలో అధికారులు సేవలందించాలని సూచించారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో మోదీ 12 ఏళ్ల పాలన విజయాల ప్రదర్శన

**○ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది**

**○ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

బీజేవైఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి సూచనల మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తుంగ యశ్వంత్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితీ ప్రదీప్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్కే శంభశివరావు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ద్వారా దేశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు చేరువ అవుతాయని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వ విజయాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ.. కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా దేశ ప్రజలందరినీ సమాన దృష్టితో చూస్తూ సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్ అనే నినాదంతో ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైరోజ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌశిక్, రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు కొచ్చర్ల దుర్గ, రామాచార్యులు, మేదూరి యశ్వంత్, కార్యదర్శులు మణిదీప్, రాజ, గణ, రాధాకృష్ణ, ఎస్సీ మోర్చా నాయకులు బ్రాహ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శులు నారాయణరెడ్డి, సురేష్ జైన్, కొక్కెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవకుడి ఆరోగ్యం విషమం.. ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** సమాజ సేవలో నిరంతరం ముందుండే గాంధీ ఆశ్రమానికి చెందిన వజ్రాల రామలింగాచారి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనను ఈ నెల 10వ తేదీన విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. గత 25 సంవత్సరాలుగా గాంధీ ఆశ్రమం ద్వారా సుమారు 30 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ వారి సంరక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న రామలింగాచారి, తన సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వైద్య ఖర్చులు భారంగా మారాయి.

ఇప్పటికే చికిత్స కోసం రూ. 5 లక్షలకు పైగా ఖర్చు అయిందని, ఇక ముందు ఎంత వ్యయం అవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, సమాజ సేవకు అంకితమైన రామలింగాచారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దాతలు, సేవాభావం కలిగిన వారు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబానికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే నంబర్ : 9347436474 ద్వారా విరాళాలు అందజేయవచ్చని తెలిపారు. వజ్రాల రామలింగాచారి త్వరగా కోలుకొని మళ్లీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**○ వైద్యాధికారులకు సూచించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్వర్ణ ఆంధ్ర --స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు.

స్టేట్ నోడల్ ఆఫీసర్, జేడీ ఎన్‌టీసీపీ డాక్టర్ సునీల్ నాయక్ జూమ్ సమావేశం ద్వారా వైద్యాధికారులను ఉద్దేశించి కార్యక్రమ నిర్వహణపై సూచనలు చేశారు. మూడో శనివారం నిర్వహించే కార్యక్రమానికి "ఆపరేషన్ క్లీన్ స్లీప్" థీమ్‌గా నిర్ణయించినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రాల పరిసరాలు, అనుసంధాన రహదారులు, అంతర్గత, బాహ్య ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి, సంబంధిత ఫొటోలను ఉదయం 11 గంటల్లోపు వైద్యాధికారి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి జిల్లాలో జరుగుతున్న హెచ్‌పీవీ టీకా కార్యక్రమం, ఎన్‌సీడీ 4.0 కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.

జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు స్టాప్ డయేరియా కార్యక్రమం, ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించి విజయవంతం చేయాలని వైద్యాధికారులను కోరారు.

ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఈ. అన్నపూర్ణ, డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీధర్, డెమో శివ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**○ ప్రజా గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరణ.. అధికారులకు తక్షణ ఆదేశాలు**

**○ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రీవెన్స్ కార్యక్రమం ఉపయోగపడుతోందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని, పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## పోలీస్ సిబ్బంది ఆరోగ్యాభివృద్ధికి 60 రోజుల యోగా కార్యక్రమం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో గుంటూరు జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన 60 రోజుల యోగా కార్యక్రమంలో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చొరవతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు ఆధ్వర్యం వహించారు.

కార్యక్రమానికి పర్యావరణవేత్త, రాజయోగి భాస్కర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరై యోగా, ప్రాణాయామం, బ్రహ్మవిద్య అంశాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడులను అధిగమించేందుకు యోగా, ప్రాణాయామం ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.

పోలీస్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక అవగాహన అవసరమని భాస్కర్ స్వామి పేర్కొన్నారు. దీర్ఘశ్వాస, ప్రాణాయామ సాధన ద్వారా శరీరానికి తగిన ఆక్సిజన్ అందడంతో శారీరక సామర్థ్యం, మానసిక స్థైర్యం పెరుగుతాయని తెలిపారు.

కార్యక్రమం ముగింపు సందర్భంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది యోగా, ప్రాణాయామాన్ని జీవితంలో భాగంగా కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీకి అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్లు, డ్రైన్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక డ్రైవ్



**○ స్వచ్ఛందంగా తొలగించుకోవాలి -- నగర కమిషనర్ మయూర్ అశోక్**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** నగర ప్రజల సౌకర్యార్థం ప్రధాన రోడ్లు, డ్రైన్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు శుక్రవారం అమరావతి రోడ్, ఎన్ఆర్టీ రోడ్‌లలో పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యలు, వర్షపు నీటి పారుదల సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో నగరపాలక సంస్థ అక్రమ ఆక్రమణల నిర్మూలన దళం ద్వారా తొలగిస్తామని స్పష్టం చేశారు. తొలగింపుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, రోజువారీ నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజా సౌకర్యాల పరిరక్షణకు నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు.

## ఫ్రైడేని డ్రై డేగా పాటించండి : డాక్టర్ హనోక్ బాబు




**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని పినపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది మరియు మలేరియా, ఫైలేరియా సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రై డే , మలేరియా వ్యతిరేక మాసోత్సవముల కార్యక్రమాలను వైద్యాధికారి డాక్టర్ హనక్ బాబు నిర్వహించారు.

ఈ సందర్భంగా పినపాడు వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు మలేరియా సిబ్బందితో కలిసి సుందరయ్య నగర్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొని దోమలు గుడ్లు పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను గుర్తించి వాటిని తొలగింప చేశారు.

ప్రజలకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమము యొక్క ప్రాముఖ్యతను , మరియు మలేరియా వ్యతిరేక మాసోత్సవాల యొక్క ఆవశ్యకతను గురించి క్షేత్రస్థాయిలో ఆయన ప్రజలకు వివరించారు. యు యల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచందర్మౌళి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ మాసాన్ని మలేరియా వ్యతిరేక మాసోత్సవముగా జరుపుకుంటున్నామని, దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం జూన్ మాసం నుంచి వర్షాలు పడటం ప్రారంభమవుతాయి కాబట్టి ఎక్కడి నీటి నిలవ్వలు అక్కడే నిలవ్వ ఉన్నట్లయితే , దోమలు గుడ్లు పెట్టి వాటి యొక్క సంతతిని పెంచుకొనుట ద్వారా మలేరియా ,డెంగ్యూ ,చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి అనేక వ్యాధులు వ్యాప్తి చెందటానికి కారణం అవుతాయని ఆయన తెలిపారు. కనుక ప్రజలు వర్షాకాలంలో ఎక్కడ నీరు నిలవకుండా అప్రమత్తంగా ఉండాలని , నీటి నిల్వల పై మూతలు పెట్టి ఉంచుకోవాలని ఆయన కోరారు. ముందుగా క్షేత్రస్థాయిలో మలేరియా ,ఫైలేరియా శాఖల ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ నీటి నిలవ్వలే దోమలకు ప్రధాన ఆవాసాలని,వర్షపు నీటి నిల్వల వలన ఇంటి లోపల ఇంటి బయట దోమలు వృద్ధి చెందుతాయి, కనుక ప్రజలు నీటి నిల్వలను వారానికి కనీసం ఒకటి లేదా రెండుసార్లు మార్చుకోవాలని దోమ కాటునుండి రక్షణ పొందుటకు సాయంత్రం సమయంలో తలుపులు కిటికీలు మూసి ఉంచాలని ఆయన తెలియజేశారు.

అదేవిధంగా ప్రతి ఒక్కరు పూర్తి వస్త్రధారణ ధరించాలని, దోమతెరలు, ఇతర దోమ కాటు నుండి రక్షించుకునే విధానాలను వాడుకోవాలని ఆయన కోరారు. వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరుగుతూ పినపాడు ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కలిగించారు .

అనంతరం పినపాడు ఆరోగ్య సిబ్బంది మలేరియా , ఫైలేరియా సిబ్బందితో పట్టణ యు. యల్. బి ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మలేరియా వ్యతిరేక మాసోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, మలేరియా సూపర్వైజర్స్ శ్రీనివాసరావు, బండారు నాగమల్లేశ్వరరావు , తిరువీధుల శివరామప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్, ఫార్మసిస్ట్ సంధ్యారాణి, సచివాలయ ఆరోగ్య కార్యదర్శిలు, ఆశ కార్యకర్తలు పినపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పవన్ కల్యాణ్ మానవతా చర్యను కూడా రాజకీయాలకు వాడుకుంటారా?



○ వైసీపీ నేతలపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర విమర్శలు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** మానవత్వాన్ని మరిచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండ చిన్నారి కోరిక మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించడాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చడం బాధాకరమని అన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పవన్ కల్యాణ్ ధైర్యం చెప్పారని, సహాయం చేయడానికి ముందుకొచ్చారని తెలిపారు.

ఇలాంటి మానవతా చర్యలను విమర్శించడం సరికాదని, మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు ప్రజలను బాధించేలా ఉన్నాయని అన్నారు. వైసీపీ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

మహిళా హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అన్నారు.

విజయవాడ గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఆరోపణలు వచ్చిన వెంటనే సీఐను సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించామని తెలిపారు. తప్పు చేసినట్లు తేలితే ఎవరిపైనా చర్యలు తప్పవన్నారు.

ఈ కేసును రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం, కులాల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదని అన్నారు. దర్యాప్తులో వాస్తవాలు బయటకు వస్తాయని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

జనసేన పార్టీ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో జాతీయ సమైక్యత అంశాలపై చర్చ జరిగిందని మంత్రి వెల్లడించారు. దేశ నిర్మాణం, జాతీయ ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. పార్టీ విస్తరణలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో కమిటీల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు.

# పాఠశాలల్లో సర్దుబాటుకు ముందే ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి

○ ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు ప్రక్రియ చేపట్టే ముందు ఉపాధ్యాయుల పదోన్నతులు నిర్వహించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాస రావు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పెద్ద సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఖాళీల కారణంగా విద్యా బోధనపై ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో అవసరమైన మేరకు మీూ, క్లస్టర్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బోధనకు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. అయితే సర్దుబాటు ప్రక్రియ కంటే ముందుగా పదోన్నతులు చేపట్టడం ద్వారా ఖాళీలను శాశ్వతంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. విద్యా రంగానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు సమావేశం జరగకపోవడం విచారకరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, ఖాళీల భర్తీ, పదోన్నతులు, సర్దుబాటు అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం వెంటనే రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



○ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించేలా పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు.

శుక్రవారం గుంటూరులో కేంద్ర మంత్రిని కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యలను వివరించారు. ప్రస్తుతం వివిధ కేటగిరీల అభ్యర్థులకు వేర్వేరు ఉత్తీర్ణత మార్కులు అమలులో ఉన్నాయని, అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు సమానంగా 60 మార్కులను అర్హతగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా సుమారు 34 లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు హాజరవుతున్న నేపథ్యంలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ సమస్య నుంచి శాశ్వత పరిష్కారం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపై స్పందించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో చర్చించి ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా వినతిపత్రం అందజేసిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ శాఖ కన్వీనర్ పి. లలిత బాబు, నగర అధ్యక్షుడు వీరరాఘవులు, నగర ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాసరావు, నగర ఉపాధ్యక్షుడు టి. రవి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

○ ఎంపీ లాడ్స్ నిధులతో 4 అదనపు తరగతి గదులు

○ ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణం

○ ప్రైవేట్ పాఠశాలలకు దీటైన సౌకర్యాలు కల్పిస్తాం

○ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటైన సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఎస్‌కేబీఎం హైస్కూల్‌లో ఎంపీలాడ్స్ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులు, ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమం కింద సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన ఆయన పాఠశాలలోని విద్యా విధానం, మౌలిక వసతులపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం, సొంత ఇల్లు ప్రధాన భారాలుగా మారుతున్నాయని అన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

1966లో స్థాపించిన ఎస్‌కేబీఎం హైస్కూల్‌లో ప్రస్తుతం 770 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. గతంలో రేకుల షెడ్లలో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉండేదని, విద్యార్థుల సంఖ్య పెరిగినప్పటికీ సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు.

నాడు-నేడు కార్యక్రమంలో 10 తరగతి గదులు నిర్మించినప్పటికీ మరో 4 గదులు అసంపూర్తిగా ఉండిపోయాయని తెలిపారు. ఎంపీలాడ్స్ నిధుల కింద రూ. 45 లక్షలు మంజూరు చేసి రూ. 43.73 లక్షల వ్యయంతో 4 అదనపు తరగతి గదులు, ప్రధానోపాధ్యాయుడి గది నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు.

ఈ కొత్త గదులతో సుమారు 160 మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం అవసరమైన 16 తరగతి గదుల్లో 14 గదులు అందుబాటులోకి వచ్చాయని, దీంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.

ఐటీసీ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్ వల్ల ఒకేసారి 180 నుంచి 200 మంది విద్యార్థులు భోజనం చేసే అవకాశం కలుగుతుందని చెప్పారు. ప్రతిరోజూ సుమారు 500 మంది విద్యార్థులకు ఈ సదుపాయం ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచేలా తరగతి గదులు, భద్రమైన వాతావరణం, పరిశుభ్రమైన భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని పెమ్మసాని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు ఎంపీలాడ్స్, సీఎస్ఆర్, దాతల సహకారంతో పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని అన్నారు.

# సాగుకు ముందే 'సుఖీభవ'.. సిరుల జిల్లాలో రైతుల్లో హర్షం



**శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్) :** అన్నదాతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకానికి శ్రీకారం చుట్టింది. ఖరీఫ్ సాగుకు ముందే రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు తొలి విడతగా నిధులు విడుదల చేస్తోంది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో రూ. 7,000 జమ చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 2,79,100 మంది రైతులకు రూ. 183 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ నిధులు రూ. 2,000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5,000 కలిపి మొత్తం రూ. 7,000 రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానుంది. గతంలో రైతు భరోసా కింద అందించిన మొత్తాన్ని పెంచి, ఏడాదికి రూ. 20 వేల పెట్టుబడి సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.

సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందడంతో రైతులకు ఆర్థిక భరోసా లభిస్తోందని అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టడంతో పాటు, బిందు, తుంపర్ల సేద్యానికి రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. దీంతో జిల్లాలోని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని, ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

# ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీజీవో సంఘం గళం

○ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని ఏపీ ఎన్జీజీవో సంఘం గుంటూరు జిల్లా తెలిపింది. జిల్లా కలెక్టర్, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ చైర్మన్ సి.ఎం. సాయి కాంత్ వర్మ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి, మెంబర్ సెక్రటరీ ఖాజావలి పాల్గొన్న ఈ సమావేశానికి 14 సభ్య సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఏపీ ఎన్జీజీవో సంఘం సమావేశంలో పలు సమస్యలను ప్రస్తావించింది. సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఉద్యోగుల తరఫున జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మలేరియా కార్యాలయం, కమర్షియల్ టాక్స్, ఇరిగేషన్, సోషల్ వెల్ఫేర్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్, వ్యవసాయ శాఖ, కో-ఆపరేటివ్ శాఖ, పెన్షనర్లు, స్వర్ణ వార్డు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన మొత్తం 98 సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రత్యేకంగా స్వర్ణ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న టీసీలు, వీ సీలు, అకారణంగా జరిగిన సస్పెన్షన్ల అంశాలను వివరించారు. అన్ని శాఖల్లో చైల్డ్ కేర్ లీవులు, సెలవుల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులను సమావేశంలో ప్రస్తావించారు.

వైద్య శాఖలో 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లింపులు, డీఎంహెచ్‌వో, డీఎంఓ కార్యాలయాల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంఘ ప్రతినిధులు వివరించారు.

ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో అన్ని శాఖల హెచ్‌ఓడీలతో ప్రత్యేక జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

దాదాపు 16 సంవత్సరాల తర్వాత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించినందుకు కలెక్టర్‌ను ఏపీ ఎన్జీజీవో సంఘం తరఫున సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా కార్యదర్శి ఏ. శ్యాంసుందర్ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు, సిటీ అధ్యక్షుడు సిహెచ్ కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూపడమే లక్ష్యంగా ఏపీ ఎన్జీజీవో సంఘం పనిచేస్తోందని నాయకులు తెలిపారు.

# గుంటూరు జీజీహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ దుర్గాప్రసాద్ బాధ్యతల స్వీకరణ



○ ఆసుపత్రి అభివృద్ధి, మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్) నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ దుర్గాప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం రేడియేషన్ అంకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్ ఈ బాధ్యతలను చేపట్టారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జీజీహెచ్ అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. నర్సింగ్ సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన సిబ్బంది నియామకాల కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అన్ని విభాగాల్లో మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఓపీ సేవలను మరింత సులభతరం చేసేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా రోగులు తమ వివరాలను నమోదు చేసుకుని ఓపీ స్లిప్ పొందవచ్చని, క్యూలలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వైద్యులను సంప్రదించే అవకాశం కలుగుతుందని వివరించారు. ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఆధునిక వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తామని, అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. సీఎస్ఆర్ నిధుల సహకారంతో ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# ప్రధాని మోదీ అభివృద్ధి పాలనపై విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎగ్జిబిషన్



○ బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో విజయాలను ప్రదర్శనగా ఏర్పాటు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాటు అందించిన సేవలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా విజయవాడ రైల్వే స్టేషన్‌లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. బీజేవైఎం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి. శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్ ఉప్పలపాటి శ్రీనివాస రాజు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలను ఈ ప్రదర్శన ద్వారా ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కీలక నిర్ణయాలు, చారిత్రాత్మక విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఫొటోలు, వివరాల రూపంలో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. దేశ నిర్మాణం, ప్రజల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షర్మిల, రహీం, దాసం సాయి, జ్యోతిర్మయి, శివలలిత, రత్నకుమారి, చైతన్య శర్మ, మనోజ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్) నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ జి. దుర్గా ప్రసాద్ శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో సేవల నాణ్యత పెంపు, రోగుల సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

# ప్రభుత్వ వైద్యులపై అసత్య ఆరోపణలు చేస్తే జైలుకే...!

○ ప్రజలకు సేవ చేస్తున్నా ఆరోపణలు భరించాల్సి వస్తోంది

○ సదరం సర్టిఫికెట్ అంశంలో గోపి ఆరోపణలు అవాస్తవం

○ సదరం సర్టిఫికెట్ వివాదంపై జీజీహెచ్ వైద్యాధికారుల స్పష్టత

○ తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలకు సిద్ధం

○ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వైద్యులపై వ్యక్తిగత కక్షతో నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్) వైద్యాధికారులు పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ జారీ విషయంలో లంచం అడిగారంటూ పట్టాభిపురానికి చెందిన గోపి చేసిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు.

ఆటిజం సమస్యతో బాధపడుతున్న తన కుమారుడికి సదరం సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 50 వేలు లంచం అడిగారని గోపి ఇటీవల పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జీజీహెచ్ అధికారులు స్పందించారు.

**నిబంధనల ప్రకారమే సదరం సర్టిఫికెట్ల జారీ**

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆటిజం సమస్యకు సంబంధించి సదరం పర్మినెంట్ సర్టిఫికెట్ 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే జారీ చేసే అవకాశం ఉందన్నారు.

ఫిర్యాదుదారుడి కుమారుడి వయస్సు ఐదేళ్లు కావడంతో సదరం సాఫ్ట్‌వేర్ ద్వారా పర్మినెంట్ సర్టిఫికెట్ జారీ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఈ విషయాన్ని బాలుడి తండ్రికి స్పష్టంగా వివరించినప్పటికీ, కావాలనే తప్పుడు ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు.

**పీజీ విద్యార్థి ద్వారా సిఫార్సు చేయించేందుకు ప్రయత్నం**

మానసిక వైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రత్న కిషోర్ మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ల విషయంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తున్నామని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్ ఇప్పించాలని గోపి ప్రయత్నించారని, తమ విభాగానికి చెందిన పీజీ విద్యార్థి ద్వారా కూడా ఒత్తిడి తెచ్చారని చెప్పారు. దీనికి సంబంధించిన సందేశాలు ఉన్నాయని వెల్లడించారు.

**దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

జీజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో కొంతమంది దళారులు రోగులను మభ్యపెట్టి వైద్యుల పేరుతో డబ్బులు వసూలు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు.

వైద్యులు ఎవరూ లంచాలు అడగరని, ఇలాంటి మోసాలకు గురికాకుండా రోగులు, వారి బంధువులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

**తప్పుడు ఆరోపణలపై చట్టపరమైన చర్యలు**

విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ వైద్యుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా, ఆసుపత్రి ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వైద్యాధికారులు తెలిపారు.

**మీడియా వాస్తవాలు పరిశీలించి వార్తలు ప్రచురించాలి**

మానసిక వైద్య విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఉమా జ్యోతి మాట్లాడుతూ.. రాత్రింబగళ్లు ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులపై ఆధారాలు లేకుండా ఆరోపణలు రావడం బాధాకరమన్నారు.

మీడియా ప్రతినిధులు కూడా ఎవరైనా ఆరోపణలు చేసినప్పుడు సరైన ఆధారాలను సేకరించి, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467